సంపుటము–XXIV
సమావేశము–XIII - 14వ శాసన సభ
నంబరు. 5

వెల : రూ. 6–00
31 జనవరి, 2019
గురువారం (మొదటి రోజు)
(శక సంవత్సరము–1940
పుష్యం – 26)

ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు
ANDHRA PRADESH
LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక
OFFICIAL REPORT
విషయ సూచిక

క్రమ సంఖ్య	విషయం		పేజీ నం.
1.	సభ ప్రారంభం (ఉ.గం. 11.00ని.)	....	01–01
2.	సంతాప తీర్మానం (అరకు నియోజకవర్గం గౌ. శాసనసభ్యులు శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మృతి పట్ల)	....	01–41
3.	సభ వాయిదా (మధ్యాహ్నం గం. 12.59 ని. లకు)	....	41–41

ఆంధ్రప్రదేశ్ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	ః	డా. కోడెల శివప్రసాదరావు
ఉప సభాపతి	ః	శ్రీ మండలి బుద్ధప్రసాద్
కార్యదర్శి(ఇన్‌చార్జ్)	ః	శ్రీ ఎం. విజయరాజు
ఉప కార్యదర్శి	ః	శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు
సహాయ కార్యదర్శులు	ః	శ్రీ పి.వి.సుబ్బారెడ్డి
		శ్రీ కె.రాజకుమార్
		శ్రీమతి ఆర్.వనితారాణి
		శ్రీమతి డా.వై.కామేశ్వరి
		శ్రీ కె.వెంకటేశ్వరరావు
		శ్రీ డి.జగన్‌మోహన్‌రావు
		శ్రీ బి.ప్రభాకర్‌రావు
		శ్రీమతి కె. భారతి
		శ్రీమతి డి. విజయకుమారి
చీఫ్ రిపోర్టర్	ః	శ్రీ శ్రీనివాస్ అల్లాడి

ఆంధ్రప్రదేశ్ శాసనసభ

గురువారం, తేది 31 జనవరి, 2019

* * *

(ఉ.11.00 గంటలకు సభ ప్రారంభమైనది. గౌరవ సభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్ఃగౌరవ శాసనసభ్యులు శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మరణం పట్ల ఇప్పుడు గౌరవ సభా నాయకులు సంతాప తీర్మానాన్ని ప్రతిపాదిస్తారు.

సంతాప ప్రతిపాదన

శ్రీ నారా చంద్రబాబు నాయుడు (కుప్పం)ఃఅధ్యక్షా, "ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభ్యులు శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నది".

అధ్యక్షా, ఒక ఎదుగుతున్న నాయకుడు, ఒక గిరిజన నాయకుడు, ఒక సమర్ధవంతమైన వ్యక్తి మొన్నటి వరకూ మనందరి మధ్యలో చాలా ఉత్సాహంగా తిరుగుతూ అందరితో కలుపుగోలుతనంగా మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో ఉండే ప్రజలకు సేవలందించాలని అను నిత్యం పరితపించే వ్యక్తి కిడారి సర్వేశ్వరరావు గారు. నేను అమెరికాలో విమానంలో ఉన్న సందర్భంలో ఈ విషాద వార్త విన్నాను. తరువాత నాకు వచ్చిన సమాచారం ప్రకారం అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు గారు, మాజీ శాసనసభ్యులు సివేరి సోమ ఇద్దరూ హత్యకు గురికాబడ్డారని తెలియడంతో, వెంటనే అక్కడుండే ఎస్పీతో మాట్లాడాను. తరువాత నేను కలెక్టర్‌తో మాట్లాడాను. వారు కూడా దీనిని నిర్ధారించారు. చాలా బాధ కలిగింది. మనసు కలచివేసే పరిస్థితి వచ్చింది. ఇంత దారుణంగా ఒక మంచి నాయకుడిగా ఎదుగుతున్న సమయంలో ఆయనను మావోయిస్టులు అత్యంత నీచంగా, దారుణంగా హత్య చేయడం చాలా బాధాకరం. ఆయన హాజరయ్యేందుకు వెళుతున్న కార్యక్రమం కూడా ప్రభుత్వ కార్యక్రమం. గ్రామదర్శిని కార్యక్రమానికి హాజరు కావడానికి వెళుతున్నారు. అంటే ప్రజలతో మమేకం కావాలి. ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలి. అదే మాదిరిగా ప్రభుత్వం ఏమి చేస్తున్నదో ప్రజలకు కూడా చెప్పి, ప్రజల్లో ఒక స్ఫూర్తి తేవాలనే ఉద్దేశంతో వెళుతున్న సమయంలో ముంచంగిపుట్టు మండలం, లివిటిపుట్టు గ్రామంలో ఆయనను దారుణంగా పొట్టనబెట్టుకున్నారు. నేను ఆ స్పాట్‌ను కూడా చూశాను. అంటే ఎంత దారుణమంటే దీని ప్రకారం ముందే రెక్కీ చేయడం, వాళ్లు అంతకు ముందే కొంత మందిని కల్టివేట్ చేసి చాలా దారుణంగా, ప్రమాదంగా ఊరిలోని వారందర్నీ భయభ్రాంతులకు గురి చేసి

ఆయనను నిర్దాక్షిణ్యంగా చంపేసే పరిస్థితి వచ్చింది. సర్వేశ్వరరావు గారు ఎప్పుడూ అరకు లోయ అభివృద్ధి కావాలని కాంక్షించేవారు. ఎందుకంటే అరకు one of the most sceneric places. ఈరోజున ఊటీ తరువాత, దానికంటే ఎక్కువగా అరకు ఉంది. ఎందుకంటే విశాఖపట్టణం నుంచి అరకు చాలా దగ్గరలో ఉంది. రావడానికి, పోవడానికి కూడా చాలా దగ్గర. మంచి వాతావరణం ఉంది. అలాంటప్పుడు ఎప్పుడూ దీనిని టూరిజమ్ హబ్‌గా తయారు చేయాలని ఆయన ఆలోచించేవారు. వైద్యాన్ని అక్కడుండే ప్రజలకు దగ్గరగా తీసుకుపోవాలని ఆయన ఎప్పుడూ పరితపించేవారు. బాక్సైట్ గనుల గురించి ఆయన నా దగ్గరకి వచ్చి చెప్పినప్పుడు "ఇది మనం చేయలేదు. గత ప్రభుత్వంలో రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్కడ బాక్సైట్ గనులన్నీ లీజుకివ్వడం, అక్కడ బాక్సైట్ ఫ్యాక్టరీకి కూడా అనుమతి ఇవ్వడం అప్పుడే చేశారు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం ఇల్లీగల్‌గా చేసింది, అవకతవకలు జరిగాయి, చాలా దారుణంగా చేశారని చెప్పి నేను అది క్యాన్సిల్ చేశాను" అని చెప్పాను. అయినా ఆయన నా దగ్గరకు వచ్చినప్పుడు కాదూ మరలా మీరు చెప్పాలని నన్ను అడిగితే నేను చాలా స్పష్టంగా ప్రకటన కూడా చేశాను. ఆరోజు నేను ప్రకటన ఇచ్చింది, బాక్సైట్ గనులను ఏదైతే మైనింగ్ డిపార్ట్‌మెంటుకు ఇచ్చిన లీజుని అక్రమంగా ప్రైవేటు పార్టీలకు ఇచ్చారు. వాళ్లకు ఇచ్చిన అగ్రిమెంటు కూడా చెల్లదు. ఎందుకంటే ఒక పద్ధతి ప్రకారం ప్రొసీజర్ కూడా అనుసరించ లేదు. పారదర్శకత లేదు. అవన్నీ చూసిన తరువాత దానిని రద్దు చేయడమే కాకుండా నేను చాలా స్పష్టంగా "గిరిజనుల మనోభావాలకు వ్యతిరేకంగా అక్కడ బాక్సైట్ ఫ్యాక్టరీ రాదు, బాక్సైట్ మైనింగ్ జరగదు, అల్యూమినియం ఫ్యాక్టరీ రాదు" అని చాలా స్పష్టంగా చెప్పాను. ఈ ప్రభుత్వం కంటే ముందున్న ప్రభుత్వంలో చేశారు, అది కూడా రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేశారు, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత దానిని రద్దు చేశాం అని చెప్పిన తరువాత కూడా కావాలని తప్పుడు ప్రచారం చేసినప్పుడు, నేను చాలా స్పష్టంగా చెప్పాను. ఈ ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదు. ఇది జరగదు అని చాలా స్పష్టంగా చెప్పిన తరువాత కూడా కిడారి సర్వేశ్వరరావు గారిని హత్య చేయడం చాలా దుర్మార్గం, బాధాకరమని నేను మీకు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, ఆయన చాలా నిస్వార్థంగా, నిజాయితీగా ఉండేవారు. ప్రజల కోసం అను నిత్యం పరితపించిన వ్యక్తి. అలాంటి వ్యక్తిని ఎలాంటి కారణాలు లేకుండా చంపడం పట్ల చాలా బాధేస్తున్నది. ఈరోజు ప్రతీ ఒక్కరూ ఆలోచించవలసిన అవసరం ఉంది. నాయకుడిగా ఎదగడం చాలా కష్టం. కొంతమందికే సహజంగా నాయకత్వ లక్షణాలు ఉంటాయి. అందులోనూ వీకర్ సెక్షన్‌లో నాయకత్వం ఎస్టాబ్లిష్ కావడానికి సమయం కూడా పడుతుంది. కిడారి సర్వేశ్వరరావు గారు ఒక సమర్థవంతమైన నాయకుడిగా ఎదిగే సమయంలో ఆయనను పొట్టనబెట్టుకోవడం చాలా బాధాకరం, దురదృష్టకరమని కూడా నేను మీకు తెలియచేస్తున్నాను. ఇది మానవత్వానికే మచ్చ తీసుకు వచ్చే పరిస్థితి తీసుకు వచ్చింది. ఎప్పుడైనా అభిప్రాయభేదాలు ఉండొచ్చు, లేకుంటే సిద్ధాంతాలు వేరే కావొచ్చు, ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదు. ఇది కరెక్టు అప్రోచ్ కాదని నేను చాలా తీవ్రంగా ఖండిస్తున్నాను. అధ్యక్షా, ఆయన

ఎప్పుడూ ఒకటి ఆలోచించేవారు. ఈ అడవి బిడ్డలు ఫారెస్ట్ ఏరియాలో ఉన్నారు. వారికి కనీసం తాగేందుకు నీళ్లు లేవు. గ్రామాలకు పోవడానికి రోడ్లు లేవు. అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. ఇంకొకపక్క సరైన పౌష్టికాహారం కూడా లేకుండా బాధ పడుతున్నారు. అలాంటి సందర్భంలో ఈ నాయకులందరూ గ్రామాల్లో తిరగకపోతే వారి సమస్యలు అర్థం కావు. ఈ విధంగా తిరిగినప్పుడు దుర్మార్గంగా చంపడమనేది ఇది ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని నేను మీకు తెలియచేస్తున్నాను. అధ్యక్షా, అక్కడ 50 పడకల ఆసుపత్రి ఉంటే దానిని 100 పడకల ఆసుపత్రిగా చేయడం కోసం ముందుకు పోయారు. ఇంకొకపక్కన రూ.166 కోట్ల వ్యయంతో ఏజెన్సీ ఏరియాలో మంచినీటి ప్రాజెక్టుని అమలు చేశారు. పాడేరులో సర్వేశ్వరరావు గారు గానీ, అక్కడ స్థానిక శాసనసభ్యులు గానీ అందరూ చెప్పిన తరువాత జిల్లా స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశాం.

11.10 am

నియోజకవర్గంలో అరకులో పెద్దయెత్తున రోడ్లు రావాలని అనునిత్యం ప్రయత్నం చేశారు. ఇంకొకప్రక్కన ఆయన చనిపోయే నాటికి సొంత ఇల్లు కూడా లేదు. గవర్నమెంటు క్వార్టర్‌లోనే ఉంటూ, ఆయన సతీమణి విశాఖపట్నంలో ఉద్యోగం చేసే పరిస్థితి ఉంది. పిల్లలు కూడా అప్పటికి చదువుకుంటూ ఇంకా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి. మన దగ్గర ఉండే శ్రావణ్ కుమార్ కూడా ఉద్యోగం కోసం గ్రూప్-1 సర్వీసులకు ప్రాక్టీస్ చేసే పరిస్థితి ఉంది. ఇవన్నీ చూసినప్పుడు ఒక్కొక్కసారి మనిషిని దారుణంగా చంపినప్పుడు మనం నిమిత్తమాత్రులమైపోతున్నాం. మనిషి ప్రాణాలను మనం తిరిగి తేలేకపోతున్నాం. కానీ ఆ కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటాం, అన్ని విధాలుగా ఆదుకుంటాం. అందుకనే అధ్యక్షా నేను ఒకటే చెప్పాను. నేను వచ్చిన రోజునే నేరుగా పాడేరుకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించాను. ఇక్కడ ఉన్న శ్రావణ్ కుమార్ గారైతే, అంతవరకు ఎప్పుడూ నా దగ్గరకు రాలేదు. తండ్రి చనిపోయాడు పరామర్శించడానికి వెళ్లినప్పుడు, ఫస్ట్ టైమ్ శ్రావణ్‌ని అక్కడ చూశాను. వాళ్ల బాధను అర్థం చేసుకున్నాను. వారి బాధను అర్థం చేసుకున్న తర్వాత ఆ కుటుంబ సభ్యులను పరామర్శించిన తర్వాత, నాకు అనిపించింది ఇంత దారుణంగా చంపేయడమనేది చాలా బాధేసే పరిస్థతి.

అందుకనే, ఈరోజు సర్వేశ్వరావు గారిని గానీ, సివేరి సోమను గానీ మనం తీసుకురాలేము. కానీ ఈ ప్రభుత్వం ఆ కుటుంబాలకు అండగా ఉంటుంది. అన్ని విధాలుగా ఆ కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో కొన్ని నిర్ణయాలను చేశాము. కిడారి సర్వేశ్వరరావు గారి కుటుంబానికి కోటి రూపాయల డబ్బులు ఇచ్చాం. ఇంతకు ముందున్న రూల్ ప్రకారం శ్రీ కిడారి శ్రావణ్ కుమార్ గారి బ్రదర్ శ్రీ కిడారి

సందీప్ కుమార్‌కి గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చాం. ఇంకొకప్రక్కన వారి సిస్టర్‌కి ఎంబిబిఎస్ అడ్మిషన్ ఇప్పిస్తామని హామీనిచ్చాం. ఇంటర్మీడియట్ పూర్తవుతూనే ఆ అవకాశం కూడా వస్తుంది. విశాఖపట్నంలో ఒక సైట్ కూడా ఆ కుటుంబానికి ఇస్తున్నాం. ఇంకొకప్రక్కన సెరీకల్చర్ డిపార్ట్‌మెంటుకు సంబంధించి ఒక ఎకరం ల్యాండ్ ఉంది. అక్కడ్నే అంత్యక్రియలను చేశారు. దానిని ఒక మెమోరియల్‌గా తయారు చేయడానికి ముందుకుపోతున్నాం. ఇంకొకప్రక్కన పార్టీ పరంగా, వారి కుటుంబంలో నలుగురు ఉంటే ఒక్కొక్కళ్లకు అయిదు లక్షల చొప్పున వాళ్లకు ఆర్థిక సహాయం చేస్తున్నాం. ఇంకొకప్రక్కన సెక్యూరిటీని కూడా పూర్తి స్థాయిలో వారికి ఇచ్చే పరిస్థితిని తీసుకొచ్చాం.

అదేమాదిరిగా సివేరి సోము కుటుంబాన్ని కూడా ఆదుకోవడానికి ముందుకు పోయాము. పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఒక ఉద్యోగాన్ని కూడా వారికి ఇచ్చి, అదేమాదిరిగా వారికి కూడా ఇంటి జాగాను ఇవ్వడం ఇవన్నీ చేస్తున్నాం. ఏ పార్టీ అయినా, ఎప్పుడు కూడా ప్రభుత్వంలో ఉండే వాళ్లందరూ ప్రజలకు సేవ చేయాలని ముందుకుపోయినప్పుడు, ఇలాంటి దారుణాలు చేయడమనేది చాలా బాధాకరం. ఇంతకు మునుపు మీరు చూశారు. మంచి మంచి నాయకుల్ని ఆ రోజు మాధవరెడ్డి గారిని గానీ, ఇటువంటి వాళ్లను కూడా మనం పోగొట్టుకునే పరిస్థితి వచ్చింది. ఇలాంటివన్నీ గుర్తు చేసుకుంటూ మరొక్కసారి ఈ శాసనసభ ద్వారా తీవ్రవాదులకు గానీ, అదేమాదిరిగా సమాజం పట్ల భాద్యత కలిగిన ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడండి. మీకు విభేదాలు ఉంటే విభేదించండి గానీ, ప్రాణాలను తీసి సంచలనం సృష్టించాలనో లేకపోతే ఇంకొకటి చేయాలనో చేయడం మంచిది కాదు. అందులో పేద కుటుంబాల నుంచి నాయకత్వం రావడం, ఎప్పటికప్పుడు వీకర్ సెక్షన్స్ నుంచి నాయకత్వం రావడం చాలా అరుదుగా వస్తుంది. అలాంటి అరుదుగా వచ్చిన నాయకుడిని పొట్టన పెట్టుకోవడం వల్ల మీరు సాధించేది ఏమీ ఉండదు. ఆ విషయం గుర్తు పెట్టుకోవాల్సిందిగా వారికి విజ్ఞప్తి చేస్తూ, గట్టిగా చెబుతూ, అదే సమయంలో కిడారి సర్వేశ్వరరావు గారు చనిపోయారు గానీ, శ్రీ కిడారి శ్రావణ్ గారి ఆధ్వర్యంలో మళ్లీ ఆయన ఆశయాలు, ఏవైతే ఆయన అనుకున్నారో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం గానీ, పేదరిక నిర్మూలన గానీ, వీటన్నింటికీ కూడా పూర్తిగా శ్రావణ్ కుమార్ గారికి ఈ ప్రభుత్వం, ఈ పార్టీ కూడా అండగా ఉంటుంది. అన్ని విధాలుగా సహకరించి ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని తెలియజేస్తూ, మరొక్కసారి తమరి ద్వారా ఆ కుటుంబ సభ్యులందరికీ హామీనిస్తూ, ఈ శాసనసభలో మిమ్మల్నందరినీ చూశాం. ఇక్కడ ఉండే నాయకులందర్నీ చూశాము. నేను ఎప్పుడు వచ్చినా సర్వేశ్వరరావు గారిని చూసేవాడ్ని. ఇప్పుడు కూడా నా కళ్ల ముందు కనిపిస్తున్నాడు. ఎంత సింపుల్‌గా ఉండేవాడంటే అంత సింపుల్‌గా ఉండేవాడు. 24 గంటల్లో నా దగ్గరకు

ఎప్పుడొచ్చినా అరకు సమస్యల గురించి, లేకపోతే అక్కడి ప్రజల సమస్యల గురించి తప్ప ఇంకొక సమస్య గురించి మాట్లాడిన సందర్భాలు లేవు. ఎప్పుడూ పదవి అడిగిన సందర్భాలు లేవు. ఆయన సేవల్ని గుర్తించి నేను ఆలోచించాను. ఆయన్ను గుర్తించాలనే ఉద్దేశంతోనే విప్ పదవిని కూడా ఇచ్చాం. ఆ విప్ పదవిని ఇచ్చినప్పుడు నాకు ఇంకా సన్నిహితుడయ్యాడు. ఎప్పటికప్పుడు వచ్చి మాట్లాడేవాడు. అలాంటి ఉన్నతమైన ఆశయాలు కలిగిన వ్యక్తి మన మధ్య లేకుండా పోవడం చాలా బాధాకరం. దీనికి నా తీవ్ర ఆవేదనను వ్యక్తం చేస్తూ, ఏదేమైనా ఆ కుటుంబానికి పూర్తిగా అండగా ఉంటామని మరొక్కసారి హామీనిస్తూ, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని, సర్వేశ్వరరావు గారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడ్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి (పెందుర్తి)ః ధన్యవాదాలు అధ్యక్షా. దురదృష్టం. గత శాసనసభ సమావేశాల ముగింపులో మా ప్రక్కనే ఉండి, ఆయనతో మేము కలిసి భోజనం చేశాము. కలిసే విజయవాడ వరకు ప్రయాణం చేశాము. సర్వేశ్వరరావుగారితో గత 15 సంవత్సరాలుగా నాకు పరిచయం ఉంది. నేను వేరే పార్టీలో ఉన్నప్పటికీ, ఆయన ఎమ్మెల్సీకి పోటీ చేసినప్పుడు నేను అధ్యక్షుడిగా ఉండటం, అప్పటి ఎన్నికల్లో నేను ప్రచారానికి వెళ్లినప్పుడు, వేరే పార్టీలో ఆయన ఉన్నప్పటికీ అప్పుడప్పుడు నాతో ఫోన్ చేసి మాట్లాడటం, అప్పుడు ఎమ్మెల్సీ పదవి వచ్చినప్పుడు రెండు సీట్లే ఉంటే, మన తెలుగు దేశం పార్టీ, ఇతర పార్టీ వాళ్లు పోటీకి పెట్టినప్పుడు అదృష్టవశాత్తు రెండు యూనానిమస్ అయ్యాయి. ఏజెన్సీలో నాకు అనుభవం ఎక్కువగా ఉంది. చాలా మంది గిరిజన నాయకులను నా కళ్లతో చూశాను. చాలా మంది ఒక్కసారికే తెరమరుగైపోయారు. గిరిజనులతో ఎక్కువగా మమేకమయ్యేవారు కాదు. ఏదో గెలిచామని ఆయా ప్రాంతాల్లో పర్యటించేవారు.

అలాంటిది ఒక ఎమ్మెల్సీగా ఎన్నికైన వ్యక్తి, ప్రజలతో సంబంధం లేని పదవి అయినప్పటికీ గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా అనేక సందర్భాలలో ఆయన అక్కడ కృషి చేస్తూ ఉండేవారు. ఇప్పుడే మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు, మా గిరిజన ప్రాంతంలో ఒక తీవ్రమైన సమస్య నడుస్తుంది. అది బాక్సైట్ గురించి. ఆ బాక్సైట్ విషయంలో ఆరోజు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, యాక్ట్-107ని అమెండ్ చేయడం ఇష్టం లేక, ఆరోజు ఎవరు వచ్చినప్పటికీ కూడా, ఇదే Anrak వారికి వచ్చినప్పుడు కూడా మనం రిజక్ట్ చేశాము. అదే రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత భయంకరంగా, ఏదైతే యాక్ట్-107ని ప్రక్కన పెట్టి Anrak వారికి, పెన్నా సిమెంట్ ప్రతాపరెడ్డి గారికి లీజుకిచ్చినప్పుడు, అరకులో జిందాల్‌కి ఇచ్చినప్పుడు తీవ్రమైన

ఉద్యమం బయలుదేరింది. ఆ ఉద్యమంలో మన పార్టీ పరంగా మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సలహా మేరకు మేము భారీయెత్తున ఉద్యమం చేశాము.

ఎందుకంటే ఈ పరిస్థితిని ముందుగా సమాజానికి తెలియజేయాలి. రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, మేము ఉద్యమం చేస్తున్నప్పుడు, వేరే పార్టీలో ఉండి కూడా మేము పాదయాత్ర చేస్తుంటే సర్వేశ్వరరావు గారు వచ్చి మమ్మల్ని కలిసి అభినందించారు. అన్నా.. మీరు మంచి పని చేస్తున్నారు, మా నాయకుడికి అర్థం కావడం లేదు, ఈ అంశం మా ప్రాణాలతో ముడిపడి ఉందని చెబుతుండేవాడు. ఆ తర్వాత అదృష్టవశాత్తు మన ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఆయన ప్రతిపక్షంలో సభ్యుడిగా ఉండటం, హైదరాబాదులో గానీ ఇక్కడ గానీ మమ్మల్ని కలిసిన ప్రతిసారి మీరే ఉద్యమం చేశారు కదన్నా.. ఆ బాక్సైటు గురించి ఏమి చేస్తారు అనే వాడు. గౌరవ ముఖ్యమంత్రి గారు పటిష్టమైన నిర్ణయంతో ఉన్నారు. కఠినమైన నిర్ణయాన్ని తీసుకుంటారు. ఇందులో రాజీపడే సమస్య లేదు. ఏ ఫ్యాక్టరీ అయినా ఎవడైనా పర్వాలేదు, తమ్ముడూ నీవు గాబరాపడాల్సిన అవసరం లేదు, త్వరలోనే ఆర్డర్ వస్తుందని చెప్పడం, దానికి అనుగుణంగా సంవత్సరంనర కాలం లోపల అంతకు ముందు ఎన్ఎండిసి వారు ఇచ్చిన లీజుని ముఖ్యమంత్రిగారు రద్దు చేశారు. ఆ లీజును రద్దు చేసినప్పుడు ఆ పార్టీలో సర్వేశ్వరరావు గారి మీద అనుమానాలు బయల్దేరాయి. సర్వేశ్వరరావు గారు ముఖ్యమంత్రి గారితో లోపాయికారిగా కలిసారు, అందుకే రద్దైందని ఆయన మీద పుకార్లను లేవనెత్తారు. అయినా ఆయన భయబడలేదు. ఎందుకంటే ఇదొక మంచి కార్యక్రమం. గిరిజనుల మనోభావాలకు అనుగుణమైన కార్యక్రమం.

మంచి కార్యక్రమమని ఎప్పుడు కూడా, కొంత మా మీద జిల్లా పరిషత్తులో మాతో పోరాడుతూ ఉండేవారు. ఎప్పుడు చేస్తారు? చేస్తారా? తీర్మానాన్ని పెడతారా? అని జిల్లా పరిషత్తులో తీర్మానాన్ని పెట్టారు. ఏ రోజైతే గౌరవ ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకున్నారో ఆ రోజు నుండి ఆయన స్వేచ్ఛజీవి అయిపోయి, మన ముఖ్యమంత్రి గారి కార్యక్రమాల సందర్భంలో ఆయన అంటుండేవారు. అయ్యా మీరు ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అయ్యారు, నేను మొట్టమొదటిసారి ప్రజల్లో గెలిచాను, చిన్న వయసులో గెలిచాను, నేను ఏమీ చేయలేకపోతున్నాను, మా నాయకుడ్ని చూస్తే ఎవర్నీ కలవొద్దు ఏ కార్యక్రమాన్ని చేయొద్దంటాడు.

11.20 AM

అలాంటి పరిస్థితుల్లో ఒక చక్కటి నిర్ణయం, మా నాయకుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆశయాలకు అనుగుణంగా మా పార్టీలోకి శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు రావడమనేది జరిగింది.

పార్టీలోకి వచ్చిన తక్కువ కాలంలోనే, ఒకటి, రెండు నెలల కాలంలోనే ఇందాక గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్టుగానే హాస్పిటల్ అప్‌గ్రెడేషన్ విషయంలో శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు ఎంతో చొరవ తీసుకోవడం జరిగింది. అయితే అరకు నియోజకవర్గ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణం విషయంలో గానీ, రోడ్ల మరమ్మతుల విషయంలో గానీ, గిరిజన ప్రాంతాల్లో సి.సి.రోడ్ల నిర్మాణం విషయంలో గానీ గౌరవ పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులైన శ్రీ నారా లోకేశ్ గారి దయ వలన, వారి సహకారంతో చాలా పెద్ద మొత్తంలో నిధులను తీసుకువెళ్లి అభివృద్ధి చేయడమనేది జరిగింది. మేమంతా శ్రీ సర్వేశ్వరరావు గారి మీద ఒకరోజున కోప పడ్డాం. ఏమయ్యా, వెనుక వచ్చావ్, ఎక్కువ గ్రాంట్ పట్టుకుపోయావని చెప్పి కోపపడ్డాం. మొత్తం ఏదైతే ఎ.డి.పి. (Area Development Programme) ఉందో, Village Adoption and Development Programme ఉందో, ఆ ప్రోగ్రామ్ క్రింద మేమంతా కేవలం రూ.15.00 కోట్ల నుంచి రూ. 20.00 కోట్ల వరకు మాత్రమే నిధులను పట్టుకెళ్లితే శ్రీ సర్వేశ్వరరావు గారు వారి నియోజకవర్గానికి దగ్గర దగ్గర శ్రీ లోకేశ్ గారి సహకారంతో రూ. 180.00 కోట్లు పట్టుకెళ్లి ఆ ప్రాంతంలో ఆ నిధులతో మొత్తం రోడ్లన్నింటినీ వేసినట్టుగా వారు చెప్పినట్టి సందర్భం కూడా ఉంది. ఒకే నియోజకవర్గానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి గారైన శ్రీ నారా లోకేశ్ గారి కృషితో రూ.180.00 కోట్ల నిధులను పట్టుకెళ్లి మొత్తం నియోజకవర్గంలోని రోడ్లన్నీ వేయడం జరిగిందన్నా అని చెప్పి సర్వేశ్వరరావు గారు మాకు చెప్పిన పరిస్థితి ఉంది. అంటే, వారు కేవలం రెండేళ్ల అభివృద్ధి కోసమే తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. అనుకోకుండా ఆయనకున్న చాకచక్యం వల్ల గానీ, ఆయన వయసును చూసి గానీ గౌరవ ముఖ్యమంత్రి గారు వారిని పార్టీలోకి ఆహ్వానించి, అభినందించి, ఆయనకు విప్ పదవి ఇవ్వడం జరిగింది. విప్ పదవి పొందినాక కూడా వారు ఎప్పుడూ కూడా ప్రొటోకాల్‌ను ఉపయోగించుకోలేదు. అది వాస్తవం. ఇందాక పెద్దలు ముఖ్యమంత్రి గారు కూడా చెప్పడం జరిగింది. విప్‌గా ఎప్పుడు కూడా వారు ప్రొటోకాల్ పైన ఆధారపడేవారు కాదు. ఎక్కడికైనా సరే సింపుల్‌గా వచ్చేవారు. మేము అడిగేవాళ్లం. ఎప్పుడన్నా మాట్లాడినప్పుడు, ఏమిటి సర్వేశ్వరరావు గారూ మీరు చక్కగా విప్ కాబట్టి మీకు కేబినెట్ ర్యాంక్ ఉందంటే, ప్రోటోకాల్‌ను వినియోగించుకోమని తాను అన్నప్పుడు, నాకెందుకన్నా, ముందుగా నాకు పనులు కావాలి అని చెప్పేవాడు. నాకు పనులే ముఖ్యమని అంత చక్కగా, సామాన్యుడిగా జీవించే ఒక వ్యక్తిని మావోయిస్టులు చంపడమనేది దుశ్చర్య అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

అధ్యక్షా, ''గ్రామ దర్శిని - గ్రామ వికాసం'' అనేది చాలా మంచి ప్రభుత్వ కార్యక్రమం. ఆ కార్యక్రమం ద్వారా తామంతా ప్రజల్లోకి వెళ్లి ప్రజలతో మమేకం అయి వారి సమస్యలను, వాళ్ల మనోభావాలను అడిగి తెలుసుకుంటున్నాం. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ప్రభుత్వం చేసిన, చేస్తోన్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వారికి అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలకు ఎప్పుడు ఏది అవసరమో, అది వారికి ఇస్తున్నాం. అటువంటి పరిస్థితుల్లో మావోయిస్టులు శ్రీ సర్వేశ్వరరావు గారిని పొట్టన పెట్టుకోవడం దురదృష్టకరం. అయితే, ఆనాడు నాతో పాటు కొంత మంది

సహచర సభ్యులు కూడా వారితో అన్నారు. ముఖ్యమంత్రి గారు ఆరోజున టి.డి.ఎల్.పి. సమావేశాన్ని నిర్వహించారు. ఆ సమావేశంలో గౌరవ ముఖ్యమంత్రి గారు మాతో ఒక మాట చెప్పారు. ఏమిటంటే, గ్రామాల్లో మీరంతా తిరగాలని వారు జనరల్‌గా మాకు చెప్పడం జరిగింది. ఆరోజున ఇక్కడే క్యాంటిన్‌లో భోజనం చేస్తూ ముఖ్యమంత్రి గారు మాకు చెప్పడం జరిగింది. గ్రామాల్లో తిరగాలమ్మా, తప్పదు అని ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. సర్వేశ్వరరావు గారూ మాతో చెప్పడం జరిగింది. ముఖ్యమంత్రి గారు చెబుతున్నారు కాబట్టి మనం గ్రామాల్లో తిరగాలి అన్నా, గ్రామాల్లో తిరగకపోతే మనకు ప్రజా సమస్యల గురించి ఏమి తెలుస్తాయి, ఎంత కాలమని మనం భయపడతాం, ఎంత కాలం మన ప్రాణాలకోసం భయపడి, ప్రజలకు దూరమవుతామని చెప్పి వారు చెప్పడం జరిగింది. ఇక్కడ చెప్పిన తరువాత అక్కడకు ప్రయాణం మొదలైంది. దౌర్భాగ్యం. మావోయిస్టులను నేను అడుగుతున్నాను. అసలు మీ భావాలేమి? మీ సిద్ధాంతాలు ఏమి? ఎవరి కోసం మీరు ఏజెన్సీలో పోరాడుతున్నారు? అలాంటప్పుడు గిరిజనుల కోసం పోరాడే వ్యక్తి, ఒక గిరిజనుడు, తక్కువ వయసులో, చిన్న వయసులో గిరిజనుల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం గిరిజన గ్రామాల్లో శ్రీ సర్వేశ్వరరావు గారు తిరుగుతూ ఉంటే, అంత కిరాతకంగా చంపాల్సిన ఆగత్యమేమి ఉంది? బాక్సైట్ త్రవ్వకాలే ప్రధాన కారణమని మావోయిస్ట్‌లు చెబుతున్నారు. కానీ, సర్వేశ్వరరావు గారు, బాక్సైట్ త్రవ్వకాలను క్లియర్‌గా రద్దు చేసి, ఒక ఇండస్ట్రియల్ ఏదైతే మాకవారపాలెంలో ఉన్న Anrak Industry ఉందో, అది మూతపడే పరిస్థితివస్తే దానికి కూడా ఇండస్ట్రీస్ ప్రమోషన్ చేయాలన్న భావన ముఖ్యమంత్రి గారికి ఉన్నా, ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటును ఒకవైపున ప్రొత్సహిస్తున్నప్పటికి కూడా, మాకవారపాలెంలో బాక్సైట్ పరిశ్రమను మూసివేస్తున్నప్పటికి కూడా గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా దాన్ని రద్దు చేసినప్పటికి కూడా, అది గిరిజన మనోభావాలకు వ్యతిరేకమని చెప్పిదాన్ని రద్దు చేస్తే కూడా ప్రయోజనం చేకూరలేదు. ఇప్పటికి కూడా కొన్ని పార్టీలు చెబుతున్నాయి. ముఖ్యమంత్రి గారు జి.వొ. జారీ చేశారని కొంత మంది చెబుతున్నారు. మొత్తం మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను తీయడమే కాకుండా అసలు బాక్సైట్ త్రవ్వకాలే చేపట్టకూడదనే విధంగా ప్రభుత్వం ఒక జి.వొ.ను జారీ చేసింది. ఒక ప్రక్క స్పష్టంగా గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినప్పటికి కూడా కిరాతకంగా సర్వేశ్వర రావును మావోయిస్ట్‌లు చంపడమనేది జరిగింది. పాపం ఆరోజున సర్వేశ్వరరావు గారు మావోయిస్ట్‌ల కాళ్లకు దండం పెట్టుకున్నారు. అన్నా, నన్ను చంపకండి, మీకు ఏమి కావాలో చెప్పండని ప్రాధేయపడినప్పటికి కూడా కిరాతకంగా వారిని చంపడమంటే, మావోయిస్ట్‌ల భావాలేమిటో, సిద్ధాంతాలేమిటో తెలియడం లేదు. అంటే ప్రాణానికి ప్రాణం తీయడమనేదా మావోయిస్ట్‌ల సిద్ధాంతం? మానవత్వ కోణంలో చూడరా? మానవత్వం ఉన్న మృగాలు సైతం మనల్ని కాపాడుతున్నాయి. మనం టి.వి. వంటి వాటిల్లో చూస్తున్నాం. మృగాలు కాపాడుతున్నటువంటి ఇలాంటి రోజుల్లో ఒక అమాయకుడైనటువంటి గిరిజన ప్రజాప్రతినిధిని, గిరిజనుల అభివృద్ధికోసం, అభ్యున్నతి కోసం, అరకు ప్రాంత అభివృద్ధి కోసం, వారి సంక్షేమ కోసం, అరకు ప్రాంత టూరిజమ్ అభివృద్ధి కోసం, అందులో భాగంగానే బెలూన్స్ ఫెస్టివల్ వంటి వాటిని నిర్వహించడమనేది జరుగుతోంది. అలాంటి కార్యక్రమాలు జరుగుతూ ఉంటే, ఆ ప్రాంతంలో రోడ్లు

అభివృద్ధి జరుగుతూ ఉంటే ఇలాంటి కిరాతకంగా చంపాలనే నిర్ణయం తీసుకోవడమనేది దుశ్చర్య అని భావించక తప్పదు. ఒక సహచర గిరిజనుడిని, ఒక చరిత్ర కల్గిన గిరిజన ప్రజాప్రతినిధి అయిన సర్వేశ్వరరావు గారిని హఠాత్తుగా చంపి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటమనేది మావోయిస్ట్‌ల చర్యను సమాజం ఖండించాల్సిన అవసరం ఉంది. తరువాత మన ముఖ్యమంత్రి గారిని అభినందించాలి. గిరిజనులందరూ అర్థం చేసుకున్నారు. ఎందుకంటే, అంతకు ముందు చాలా మంది ప్రజాప్రతినిధులను, అధికారులను మావోయిస్ట్‌లు కాల్చి చంపారు. అలాంటి కుటుంబాలు చాలా ఉన్నాయి. గతంలో రాజశేఖర రెడ్డి గారి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఒక వైస్ చైర్మన్‌ను, ఒక జెడ్.పి.టి.సి.ని మావోయిస్ట్‌లు కాల్చి చంపారు. కానీ, ఆరోజున వారు అలాంటి ఏ రకమైన ఆలోచన ప్రభుత్వపరంగా చేయలేదు. కేవలం సంతాపం తెలియజేయడంతోనే రాజశేఖరరెడ్డి గారు క్లోజ్ చేశారు. ఆనాడు వారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. కనీసం వారు పరామర్శకు కూడా పోలేదు. కానీ, సర్వేశ్వరరావు గారిని మావోయిస్ట్‌లు కాల్చి చంపిన రోజున గౌరవ ముఖ్యమంత్రి గారు అమెరికా పర్యటనలో ఉన్నప్పటికి కూడా మాకందరికీ ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి, అధికారులను సమాయత్తపరచి, యావత్తు జిల్లా యంత్రాంగంతో, ఎమ్మెల్యేలను, మంత్రులతో కూడా ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడుతూ మంత్రి శ్రీ నక్కా ఆనందబాబు గారు గానీ, జిల్లా మంత్రులైన శ్రీ అయ్యన్న పాత్రుడు గారు గానీ, శ్రీ గంటా శ్రీనివాసరావు గారు గానీ, హోం మంత్రి శ్రీ చినరాజప్ప గారు గానీ, అందరు కూడా కలిసికట్టుగా వెళ్లి సర్వేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శ చేయడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు చేసిన నిర్ణయం కేవలం సర్వేశ్వరరావు గారి కుటుంబానికే కాదు, యావత్తు గిరిజన సోదరులకిచ్చిన భరోసా అని భావించాలి. ఎవరైతే దుశ్చర్యకు పాల్పడుతున్న మావోయిస్ట్‌ల కిరాతక చర్యకు ప్రతిఘటనగా భరోసా ఇచ్చిన కార్యక్రమం. మేమంతా ఆశ్చర్యపోయాం. మళ్లీ ఈ కుటుంబం ఏమైపోతుంది? సర్వేశ్వరరావు గారి కుటుంబానికి ఏదో సానుభూతిగా ప్యాకేజీ ఉంటుంది, ప్యాకేజీ ప్రభుత్వపరంగా ముఖ్యమంత్రి గారు ఇస్తారేమోనని మేమంతా అనుకున్నాం. కానీ, ముఖ్యమంత్రి గారు అమెరికా పర్యటన నుంచి వచ్చిన వెంటనే సర్వేశ్వరరావు గారి కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. ఇందాక సార్ చెప్పడం జరిగింది. మనమంతా చూశాం. సర్వేశ్వరరావు గారి పెద్ద కుమారునికి ఈరోజున సముచితమైన స్థానం, ఎందుకంటే, ఏ గిరిజనులకైతే సర్వేశ్వరరావు గారు సేవ చేయాలని కోరుకున్నాడో, ఏ గిరిజనుడి మనోభావాలు దెబ్బతీసే విధంగా సర్వేశ్వరరావు గారిని హత్య చేశారో, దానికి సరైన సమాధానంగా, అందుకు ధీటుగా సర్వేశ్వర రావు పెద్ద కుమారుడైన శ్రీ కిడారి శ్రవణ్ కుమార్ గారికి ముఖ్యమంత్రి గారు ఒక కేబినెట్ ర్యాంకుతో కూడిన మంత్రి పదవినిచ్చి, అందున కూడా గిరిజన సంక్షేమ శాఖను ఇవ్వడం, గిరిజనులకు సేవ చేసే అవకాశం వారికి కల్పించడం, మళ్లీ సర్వేశ్వరరావు గారి ప్రతిరూపాన్ని ప్రజల్లో చూపించే అవకాశం కల్పించినందుకు గానూ మా జిల్లా తరఫున, గిరిజనుల తరఫున కూడా సర్వత్రా గౌరవ ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతగా మేమంతా ఉంటాం. అందులో ఎటువంటి సందేహం లేదు. అంతటితో ఆగలేదు.

రెండవదేమిటంటే, సర్వేశ్వరరావు గారికి మరో కుమారుడు మరియు కుమార్తె కూడా ఉన్నారు. సర్వేశ్వరరావు గారికి చెందిన ఒక కుమారుడిని ఒక విధంగా చూస్తూ, మరో కుమారుడి విషయంలో గానీ, కుమార్తె విషయంలో గానీ ఎటువంటి వ్యత్యాసం పెట్టకూడదని ముఖ్యమంత్రి గారు భావించి, ఒక కుమారుడిని చేరదీసి, మరో కుమారిడిని దూరం చేయకూడదనే భావనతో రెండవ కుమారుడికి కూడా వారు కోరిన విధంగానే ముఖ్యమంత్రి గారు గ్రూప్ 1 ఆఫీసర్‌గా ప్రభుత్వ నియామకం ఇచ్చారు. అది కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు సర్వేశ్వరరావు గారి ఇంట్లో కూర్చొని, వారి కుటుంబంతో మాట్లాడి, సొంత కుటుంబంలో ఎవరైనా వ్యక్తి చనిపోతే ఎంతటి సానుభూతిని, ఎంత అభిమానం చూపిస్తామో, అటువంటి అభిమానం, సానుభూతిని శ్రీ సర్వేశ్వరరావు కుటుంబం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు చూపించి, ఆ కుటుంబంతో చర్చించిన తరువాతనే, వాళ్ల మనోభావాలకు అనుగుణంగానే చిన్న వయసులో ఉన్న కిడారి శ్రావణ్ కుమార్‌ను మంత్రిని చేయడం, రెండవ కుమారునికి గ్రూప్ 1 ఆఫీసర్ పోస్ట్‌ను ఇవ్వడం, కుమార్తె చదువుకు సంబంధించిన నిర్ణయం తీసుకోవడం, అదేవిధంగా సర్వేశ్వరరావు గారి సతీమణికి ప్రభుత్వోద్యోగంలో, సెరి కల్చర్ డిపార్ట్‌మెంట్ నందు అసిస్టెంట్ డైరెక్టర్ హోదాలో ఉన్నారో, వారికి పదోన్నతికి సంబంధించిన నిర్ణయాన్ని తీసుకోవడం జరిగింది. వారికి సంబంధించిన ప్రమోషన్ పెండింగ్‌లో ఉంటే ఆ ప్రమోషన్‌ను ఇవ్వడం జరిగింది. సర్వేశ్వరరావు గారి చిన్నమ్మాయి విషయంలో ఆడపిల్ల మనోభావాలు దెబ్బతీయకూడదు, తండ్రి లేని లోటు కనపడకూడదు, కూతురికి తండ్రి అవసరం ఎంతో ఉందనే భావనతో ఆలోచించి ఆ అమ్మాయిని మెడిసిన్ విద్యకు అవసరమైన ఏర్పాట్లు చేయడమనేది జరిగింది. ఇది ఎంతో భృహత్తరమైనటువంటి, ఎంతో సానుభూతితో ఆ కుటుంబాన్ని ప్రోత్సహించి, ఎంతో పెద్ద మనసుతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వపరంగానే కాకుండా తన సొంత కుటుంబంగా భావించి గౌరవ ముఖ్యమంత్రి గారు ఆ రకమైన అవకాశాలు కల్పించినందుకు ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి నేను సర్వత్రా కృతజ్ఞతలు తెలియజేస్తూ, మరొకసారి ఒక మంచి యువకుడు, గిరిజనుల కోసం అనేకమైన కార్యక్రమాలు చేసిన సర్వేశ్వరరావు గారికి, ఉదాహరణకు సర్వేశ్వరరావు గారి గురించి చెప్పాలంటే, జిల్లా ప్రజాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరైన సందర్భంగా వారు ఒక మాట అనేవారు. ఎప్పుడూ మాతో పోరాడేవారు. దేనికోసమంటే గిరిజనుల సంక్షేమం కోసమే. జిల్లా పరిషత్ మీటింగ్‌కు వారు ప్రత్యేకంగా వచ్చేవారు. ఆ సందర్భంగా మా ఇద్దరి మధ్యే ఆర్గ్యుమెంట్స్ జరుగుతూ ఉండేవి. సోదర భావంతోనే మేం ఆర్గ్యుమెంట్స్ చేసుకునేవాళ్లం. అలాంటి సర్వేశ్వరరావు గారు ఈనాడు మన మధ్య లేకపోవడమనేది తీరనిలోటు. వారిని మళ్లీ మనం తీసుకురాలేం కాబట్టి వారి కుటుంబానికి ఆ భగవంతుడు సానుభూతి చూపాలని, మనోధైర్యం ఇవ్వాలని, సర్వేశ్వరరావు గారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపం తెలియపరుస్తూ, వారి గురించి సభలో మాట్లాడే అవకాశం కల్పించిన మీకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: డా. కామినేని శ్రీనివాస్ గారూ.....

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు): నమస్కారం అధ్యక్షా, శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మరణం మనకందరికీ చాలా బాధ అనిపించింది. ఇది చాలా దుర్మార్గపు చర్య. ఎప్పుడూ అందరితో నవ్వుతూ, చక్కగా వారు మాట్లాడేవారు. సమాజంలో ఉన్న అందరూ మావోయిస్ట్‌ల చర్యను ఖండించాలి. ఎందుకంటే, వీళ్లేదో గిరిజనుల కోసం చేస్తున్నామని చెప్పి, ఆ గిరిజనులకు, ఆ కుటుంబానికి మావోయిస్ట్‌లు చేసిన అన్యాయం, అంత ఇంత కాదు. నాకు ఆయనతో మంచి సంబంధాలు వచ్చాయి. అందులో భాగంగా నేను మంత్రిగా ఉన్నప్పుడు వారు నా వద్దకు వచ్చి అడిగితే, వారి కోరిక మేరకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అరకు నందు 100 bedded hospital foundation కు నేను వెళ్లడం జరిగింది. ఆ తరువాత మళ్లీ ఒకటిన్నర సంవత్సర కాలం తరువాత ఆ హాస్పిటల్ inauguration కు కూడా నేను వెళ్లాను. అలాంటి వ్యక్తి ఇవాళ మన మధ్య లేడంటే బాధగా ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఎందుకంటే, ఆ కుటుంబానికి వారు అండగా నిలబడి, ఆ కుటుంబంలో ఉన్న ప్రతి సభ్యుడికి, వాళ్లతో మాట్లాడి, వాళ్లకున్న బాధను కొంతవరకు తగ్గించినందుకు గాను గౌరవ ముఖ్యమంత్రి గారిని అభినందిస్తూ మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి ఒక విజ్ఞప్తి చేయదలిచాను. ఏమిటంటే, అక్కడున్న ఆ 100 bedded hospital కు ఆయన పేరు పెడితే సముచితంగా ఉంటుందనేదే నా అభిప్రాయం. ఎందుకంటే, చాలాసార్లు సర్వేశ్వరరావు గారు నా దగ్గరకు వచ్చి హాస్పిటల్ డెవలప్‌మెంట్ గురించి అడిగేవారు. ఆ హాస్పిటల్ అభివృద్ధి పట్ల వారు చూపిన చొరవకు గాను ఆ హాస్పిటల్‌కు వారి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరుకుంటూ, మరణించిన సర్వేశ్వరరావు గారి ఆత్మకు శాంతి కల్గాలని భగవంతుడిని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: కె.ఎస్.ఎన్.ఎస్. రాజు గారూ.

శ్రీ కలిదిండి సూర్య నాగ సన్యాసి రాజు (చోడవరం): ధన్యవాదాలు అధ్యక్షా, శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తూ, సుమారు పదహేను సంవత్సరాల నుంచి జిల్లాలో రాజకీయంగా తాము ఇరువురం స్థానిక సంస్థల్లో పనిచేసిన వ్యక్తులుగా, ఎంతో స్నేహంగా ఉంటూ పార్టీలు వేరైనా ఎప్పుడూ లోకల్‌గా ప్రజా సమస్యలపైన మాట్లాడుకోవడం జరిగేది. ముఖ్యంగా ఎప్పుడు కూడా గిరిజనుల సమస్యల పట్ల వారికి ఒక నిబద్ధత ఉండేది. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే దోరణి వారికి ఉండేడిది. అలాంటి ఆలోచనలు కల్గినటువంటి వ్యక్తి సర్వేశ్వర రావు గారు. నియోజకవర్గంలో అన్ని రకాలుగా అభివృద్ధిచేసి, గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నటువంటి వ్యక్తిని ఏదో అకారణంగా కేవలం తమ ఉనికిని చాటుకోవడానికే, కారణం చెప్పాలి కాబట్టే ఆ కారణాన్ని చెబుతున్నారు తప్ప, కేవలం ఉనికిని చాటుకోవడం కోసమే ఈ దుశ్చర్యకు మావోయిస్ట్‌లు పాల్పడ్డారనేదే మా ప్రాంతంలో ఉన్నటువంటి ప్రజల అభిప్రాయం. మరి ఆ విధంగా హింసతో, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ ప్రజాస్వామ్యంలో ఈ విధమైన చర్యలు చేపట్టడమనేది దురదృష్టకరం. లాస్ట్ సెషన్ అయిన తరువాత సర్వేశ్వరరావు గారితో కలిసి తాను ప్రయాణం చేయడం

గానీ, అనేక సందర్భాల్లో వారిని కలిసి మాట్లాడటం గానీ జరిగింది. ఆ సందర్భంలో నేను స్పష్టంగా వారి దృష్టికి ఒక అంశాన్ని తీసుకుపోవడం జరిగింది. ఆ విధమైన సంకేతాలు మాకు వచ్చేటివి. ఎందుకంటే ప్రక్కనే నా నియోజకవర్గం కూడా ఉంటుంది. ఆ సందర్భంగా అన్నా, ఈ విధంగా భద్రతకు సంబంధించి సంకేతాలు వస్తున్నాయి ఏమిటన్నా అని అడిగితే, సమస్య ఉందా అంటే ఉంది, లేదంటే లేదు అన్నట్టుగా మనం భావించాలాన్నా, ఏదైనా మనం కొంచెం జాగ్రత్తగా ఉండాలన్నా అని వారితో అంటే, ఎన్నాళ్లు మనం దాగి ఉంటాం, గ్రామాల్లో తిరగక తప్పదు కాబట్టి తిరుగుతున్నాం అని వారు నాతో చెప్పడం జరిగింది. అయితే, అప్పటికే మాకు alarming ఏమిటంటే, ఒక ప్రక్క పోలీసుల వైపు నుంచి గానీ, మరో వైపున ప్రభుత్వం వైపు నుంచి గానీ కొంచెం జాగ్రత్తగా ఉండమని సంకేతాలు వచ్చాయి. మావోయిస్ట్‌ల యాక్టివిటీస్ ఉన్నాయని చెప్పి చెప్పడం జరిగింది. కానీ, మావోయిస్ట్‌లు ఇంతటి దారుణానికి ఒడిగడతారనేది మనమెవ్వరం ఊహించలేదు. కాబట్టి ఈ విధంగా ప్రజాస్వామ్యంలో మావోయిస్ట్‌లు దుశ్చర్యకు పాల్పడటమనేది దురదృష్టకరం. అయితే, వారి కుటుంబానికి గౌరవ ముఖ్యమంత్రి గారు అన్ని విషయాల్లో అండగా నిలబడి, సర్వేశ్వరరావు గారి పెద్ద కుమారుడైన శ్రావణ్ కుమార్ గారిని మంత్రి వర్గంలోకి తీసుకోవడం గానీ, మిగతా కుటుంబసభ్యులందరికి కూడా ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించి, గిరిజన ప్రాంతాల్లో ఎవరికైనా అన్యాయం జరిగితే కేవలం ఏదో ప్రభుత్వపరంగా సంతాపం తెలియజేసి అంతటితో వదిలివేయకుండా అటువంటి వారి కుటుంబానికి అండగా నిలబడతాననే విధంగా ఒక మంచి సందేశాన్ని ఇచ్చే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు నిర్ణయం తీసుకున్నారు. అందుకుగాను విశాఖపట్టణం జిల్లా ప్రజాప్రతినిధులందరి తరఫున గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, సర్వేశ్వరరావు గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: పంచకర్ల రమేష్‌బాబు గారూ..

11.30 AM

శ్రీ పంచకర్ల రమేష్‌బాబు (ఎలమంచిలి)ః అధ్యక్షా, శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. వారు యువకులు, ఉత్సాహవంతులు. నిత్యం ప్రజాసేవకుడు. ఏదో చేయాలన్న తపనతో ముందుకుపోతున్న వక్తి. ఎప్పుడు జిల్లాలో మీటింగులు జరిగినా కూడా గిరిజన సమస్యలపై మాట్లాడేందుకు నాకు ఎక్కువ సమయం కావాలని రాజీ లేకుండా కోరుతుండే వారు. మాతోపాటు ఉన్నా, ఎక్కడున్నా, అధికార పార్టీలో ఉన్నా కూడా మంత్రులను కానీ, ఇన్‌ఛార్జ్ మంత్రులను కానీ గిరిజనుల సమస్యలపై నిలదీసే విధంగా మాట్లాడుతూ గిరిజన సమస్యలపై అనునిత్యం పోరాటం చేసే వ్యక్తిగా ముందుకు వెళుతున్నటువంటి తరుణంలో మావోయిస్టులు ఆయనను పొట్టన పెట్టుకోవడం చాలా దురదృష్టకరమైన సంఘటన అధ్యక్షా. ఆరోజు మేమంతా చాలా ధిగ్భ్రాంతికి లోనయ్యాము. ఎందుకంటే ప్రశాంతమైన వాతావరణంలో ఉన్నాము, ఏ ఇబ్బంది లేదు అని

అనుకుంటున్న నేపథ్యంలో సడెన్‌గా ఇటువంటి దురదృష్టకరమైన సంఘటన జరిగింది. ఆ సంఘటన జరిగే రోజున గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ దేశంలో లేరు. అయినప్పటికీ కూడా విదేశాల నుండే మానిటర్ చేసి పోలీసు అధికారులను కానీ, మమ్మల్ని కాని అక్కడకు పంపడం, ఆ కుటుంబంతో మాట్లాడటం కాని, విదేశీ పర్యటన నుండి వచ్చిన వెంటనే ఆ కుటుంబం దగ్గరకు వెళ్లడం కాని ఆ కుటుంబాన్ని ఆదుకున్న నేపథ్యం కాని మనకు తెలుసు. దురదృష్టకరమైన సంఘటన ఏమిటంటే ఆ ముందురోజు రాత్రి నాకు ఫోన్ చేశారు. ఒకటి, రెండు disturbance issues ఉన్నాయి, జిల్లా అధ్యక్షులు అయిన మీ దగ్గరకు రేపు ఆదివారం వస్తాను అన్నారు. నిజంగా నేను రమ్మని అని ఉంటే ఆ రోజు ఆయనకు చావు వచ్చి ఉండేది కాదేమో! నేను కూడా ఆ రోజు వేరే programme లో ఉండటం వల్ల ఉదయం కాదు రాత్రికి రమ్మన్నాను. అయితే వెనుకకు వెళ్లి పోతున్నాను అన్నా అంటూ మళ్లీ ఆయన అరకు వెళ్లడం, దురదృష్టవశాత్తు ఆ తెల్లవారే ఈ సంఘటన జరిగింది. ఆ సంఘటన బాధ, దుఖంతో కూడినది.

అయితే చనిపోయిన వాళ్లను ఎవరూ తీసుకురాలేనప్పటికీ ఆ కుటుంబం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న నిర్ణయాలను మాత్రం అభినందించాలి. కిడారి సర్వేశ్వరరావు గారికి కానీ, సివేరి సోమా కుటుంబానికి కాని, పెద్దఎత్తున ఒక కుటుంబ పెద్దలాగా నేను ఉన్నాను అంటూ ముఖ్యమంత్రి గారు అండగా నిలిచిన విధానం చూసి నిజంగా మేమంతా, జిల్లా యావత్తు అంతటి బాధలోనూ కూడా ఆనందపడ్డాము. ఎందుకంటే ఇటువంటి సమయంలో ఎవరన్నా ఒక పెద్ద దిక్కు వచ్చి నేను ఉన్నాను అని చెబితే ఆ కుటుంబానికి కొంత భారం తగ్గుతుంది.

ఆ కార్యక్రమాన్ని చాలా చిత్తశుద్ధితో మనస్ఫూర్తిగా చేపట్టడం జరిగింది. ఎందుకంటే జిల్లా అధ్యక్షునిగా నేను ముఖ్యమంత్రి గారి వెంట వెళ్లాను. ఆ కుటుంబంతో గంటలు సమయం గడిపి ఆ కుటుంబాన్ని ఓదార్చి, ఏమికావాలని అడిగి చనిపోయిన ఇరువురి కుటుంబాల బిడ్డలను ఉద్యోగస్తులు చేయడం కాని, సోమా కుమారునికి వారి తండ్రి గారి పదవి ఇవ్వడం కాని, అలాగే శ్రావణ్ కుమార్ గారిని మంత్రిని చేయడం వంటివి చేశారు. అందుకు ముఖ్యమంత్రి గారు చూపిన చొరవను రాష్ట్రం యావత్తు కొనియాడకుండా ఉండలేకపోయారు. దురదృష్ట వశాత్తు కిడారి సర్వేశ్వరరావు గారు చనిపోయినప్పటికీ వారి అబ్బాయిని, కుటుంబ సభ్యులను కాని సర్వేశ్వరరావు గారి ఆశయాలు అయిన గిరిజనుల అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ముందుకు వెళ్లే అవకాశాన్ని కలుగజేసిన ముఖ్యమంత్రి గారికి ధన్యవాదములు. ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ భగవంతుడు ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలబడాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : పల్లె రఘునాథరెడ్డి గారు..

శ్రీ పల్లె రఘునాథరెడ్డి (పుట్టపర్తి): అధ్యక్షా, కిడారి సర్వేశ్వరరావు గారు అరకు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్. అదేవిధంగా సివేరి సోమ మాజీ శాసనసభ్యులు మరియు ఎస్సీ, ఎస్టీ కమీషన్ మెంబరు.

వీరు ఇద్దరు సెప్టెంబర్, 23వ తేదీన గ్రామ దర్శిని ప్రభుత్వ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా నక్సలైట్స్ అత్యంత దారుణంగా కాల్చి చంపడాన్ని నేను పూర్తిగా ఖండిస్తున్నాను. ఇది ఏహాతి హేయమైన చర్య, నీచాతి నీచమైన చర్య, హీనాతిమైన చర్య. దీనిని పూర్తిగా ఖండిస్తూ ఆ కుటుంబానికి ప్రగాఢమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. కిడారి సర్వేశ్వరరావు గారు ఒక సాధారణమైన కుటుంబంలో జన్మించారు. తన కృషి, పట్టుదల, చిత్తశుద్ధి, అంకిత భావంతో అహర్నిశలు రాజకీయాల్లో కృషి చేశారు. అత్యున్నతమైన ప్రభుత్వ విప్ స్థాయిని కూడా పొందగలిగారు. ఆయన యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా, భద్రాచలం పార్లమెంటరీ ఎలక్షన్ ఇన్‌ఛార్జ్‌గా 2007-2009వ సంవత్సరంలో ఎంఎల్‌సీగా 2014వ సంవత్సరంలో అరకు శాసనసభ్యునిగా పదవి చేపట్టారు. ఆయన ఏ పదవి చేపట్టినా కూడా ఆ పదవిని సమర్థవంతంగా నిర్వహించి ఆ పదవికే వన్నె తెచ్చారు. అధ్యక్షా, ఈ సర్వేశ్వరరావు గారిని నేను దగ్గర ఉండి చూశాను. 2007-2009 సంవత్సరంలో శాసనమండలి సభ్యులుగా ఇద్దరము కలిసి పనిచేశాము. అంతే కాకుండా ఇప్పుడు ప్రభుత్వ విప్ గా కూడా చాలా దగ్గర నుండి పరిశీలించడం జరిగింది. చాలా నెమ్మదిగా, నిదానంగా ఉండే వారు. ఆచి తూచి మాట్లాడేవారు, సున్నితమైన మనస్తత్వం. ఆయన Character చెప్పాలంటే Marvellous, Extraordinary, Super. ఎందుకంటే దగ్గర ఉండి చూశాం. విప్‌గా ఏ పని చెప్పినా, హాజరు లెక్కించమని చెప్పినా, సభ్యులు సభ బయట ఉన్నారు లోనికి తీసుకురమ్మని చెప్పినా ఏ పని చెప్పినా, మా అందరి కన్నా చిన్న వారు కాబట్టి ఎంతో శ్రద్ధతో, వినయంగా బాగా పనిచేశారు. ఇప్పటికీ ఆయన లేరంటే నమ్మలేని పరిస్థితి. అంతే కాకుండా ప్రజలు తనమీద నమ్మకం, గౌరవం, విశ్వాసం ఉంచారు. మంచి మెజారిటీ. 34,600 ఓట్ల మెజారిటీతో గెలిపించారు. ఈ ప్రజల యొక్క రుణం తీర్చుకోవాలని అనుక్షణం ఆలోచించేవారు. త్రాగునీటికి గానీ, విద్యుత్ కానీ, రోడ్ల నిర్మాణాలకు, విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి ముఖ్యమంత్రి గారితో చొరవగా ఉండి చాలా పనులు సాధించుకునేవారు. అంతే కాకుండా బాక్సైట్ త్రవ్వకాలకు తాను వ్యతిరేకము అని చాటిచెప్పిన నాయకుడే కాకుండా ఏ ప్రభుత్వాలు ఈ గిరిజన ప్రాంతాల్లోని బాక్సైట్ త్రవ్వకాలను చేపట్టినా ప్రజాపక్షాన పోరాడుతానని చెప్పిన నాయకుడు చివరి వరకు అదే మాట మీద నిలిచారు. పదిమందికి ఉపయోగపడాలి, పదిమందికి మేలు చేయాలి, తన ప్రాంతం అభివృద్ధి చెందాలని అణువణువునా ఆలోచన చేసిన నాయకుడు. ఒక విషయం అధ్యక్షా, ఆరోజు చనిపోయిన తరువాత అంత్యక్రియల్లో వేలాధిమంది గిరిజనులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు అంటే గిరిజనుల పట్ల, గిరిజనులకు అతని పట్ల ఎంతటి అభిమానం ఉందో దీనికంటే వేరొక ఉదాహరణ లేదు అధ్యక్షా.

అంతే కాకుండా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారి ఉదారతను మనందరం అనుకోవాలి. అంటే తన సహచరుడు చనిపోతానే స్పందించిన తీరు చాలా అమోఘం. శ్రావణ్ కుమార్ గారికి అతి చిన్న వయసులో మంత్రి పదవి ఇవ్వడమే కాకుండా, సందీప్ కుమార్‌కు గ్రూప్-1 సర్వీసును ఇవ్వడమే కాకుండా, కిడారి కనుష్క అనే అమ్మాయికి మెడిసిన్ చదువుకునేందుకు అవకాశం ఇవ్వడమే కాకుండా, వారి భార్యకు కూడా సర్వీసు కన్సిడర్ చేయడం, ఇంటిస్థలం కేటాయించడం వంటి పనులు చేపట్టడం

ముఖ్యమంత్రి గారి యొక్క విశాల హృదయానికి ఆయన మానవతా వాదానికి ఇంతకంటే ప్రతీక ఉండదు.

అధ్యక్షా, అదే విధంగా ఆయన చేసిన చివరి ప్రసంగంలో గిరిజన సమస్యలపైన పిలుపు ఇచ్చారు. కొండకాపు, కొండ కుమ్మర, ఏలేటి కొండ సామాజిక వర్గాలకు న్యాయం చేయమని, వారికి కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి, వాళ్ల జీవితాలు ఆదుకోవాలి అంటూ తమరికే ఆనాడు విజ్ఞప్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అంటే చనిపోక ముందు, చనిపోయేటప్పుడు కూడా గిరిజన సంక్షేమం, వారి అభివృద్ధి కోసం పోరాడారు అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఈ శతాబ్ధంలోనే మహోన్నతమైన మానవతా వాది, మహనీయరాలు మదర్ థెరిస్సా ఒక మాట చెబుతుంది అధ్యక్షా, ఈ ప్రపంచాన్నే జయిస్తాను, దయతో, కరుణతో, అభిమానంతో. హింసతో కాదు, దౌర్జన్యంతో అంతకంటే కాదు అన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ నక్సలైట్ సోదరులు ఏదో సంచలనం సృష్టించాలని ఈ విధంగా అమూల్యమైన ప్రాణాలను తీసుకోవడం చాలా దారుణం. ఇప్పటికైనా వారు మనసు మార్చుకుని జనజీవన శ్రవంతిలో కలువాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ఆ కుంటుంబానికి తట్టుకునే శక్తిని... శ్రావణ్ కుమార్‌కు కాని, సందీప్ కుమార్, కనుష్క , పరమేశ్వరీలకు తీరని లోటు. ఎందుకంటే అటువంటి వ్యక్తిని మేమే జీర్ణించుకోలేకపోతున్నాం. ఆ కుటుంబ సభ్యులు ఏ విధంగా జీర్ణించుకుంటారో... కష్టమైన పని. అయినప్పటికీ కూడా ఆ భగవంతుడు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వారికి ధైర్యాన్ని, శక్తిని, సామర్థ్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. సర్వేశ్వర రావు ఎక్కడ ఉన్నా వారి ఆత్మకు శాంతి కలుగాలని ఈ వేదిక ద్వారా మనస్ఫూర్తిగా కోరుకుంటూ తమ వద్ద సెలవు తీసుకుంటున్నాను.

11.40 AM

మిస్టర్ స్పీకర్: గోవింద సత్యనారాయణ గారు.

శ్రీ పీలా గోవింద సత్యనారాయణ (అనకాపల్లి): ధన్యవాదాలు అధ్యక్షా. కిడారి సర్వేశ్వరరావు మా విశాఖపట్నం జిల్లా వాసి. ఆయన గిరిజన సంక్షేమానికి గాని, అలాగే వాళ్ల యోగక్షేమాల విషయంలో అను నిత్యం కూడా. అతి చిన్న వయసులో, నిరుపేద కుటుంబంలో పుట్టి గ్రామ రాజకీయాల నుంచి, వేరే పార్టీలో ఆరోజు ఉన్న డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారి పార్టీలో ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో తనకు దగ్గరగా క్లోజ్‌గా మూవ్ అవ్వడం జరిగింది. ఆరోజు కూడా, నామినేషన్ ప్రక్రియలో ఒకపక్క తెలుగుదేశం అభ్యర్థి క్యాంపెయిన్ చేస్తున్నారు, మరోపక్క ఆ పార్టీ వాళ్లు కూడా campaign చేసినప్పుడు కూడా జీపులోంచి దిగి వేరే పార్టీ వాళ్లు campaign చేస్తున్నారనే పక్షపాతం లేకుండా, ఆరోజు నేను పాడేరులో ఉన్నాను. పాడేరులో దిగి ఒక సోదరభావంతో "అన్నా ఎందుకు వచ్చావూ అని, ఆ, నాకు తెలుసు అన్నా మీరు ఎందుకు వచ్చారో, అందరం మనం కలిసి చేసుకుందాం" అనే ఒక సోదరభావంతో, పార్టీలు వేరు

అయినా ఆనాడు ఒక ఉమ్మడి కుటుంబంలో అన్నదమ్ములు ఆప్యాయత, అనుబంధంగా ఎలా ఉంటారో ఆవిధానంలో ఉన్న వ్యక్తి అధ్యక్షా.

అలాగే నియోజకవర్గంలోని సమస్యలన్నీ కూడా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అయితే ఆరోజు ఆయన ఎన్నికైన పార్టీ వేరే అయినా, అధికార పార్టీతో ఎప్పుడూ కూడా సమయం మాకు ఎక్కువ ఇవ్వండీ, విశాఖపట్నం జిల్లాలో 50శాతం ట్రైబల్ ఏరియా ఉంది, భూ విస్తీర్ణం గురించి కంపేర్ చేసేవారు. భూ విస్తీర్ణంలో సగ భాగం మా గిరిజన ప్రాంతం కాబట్టి మాకూ సగ భాగం ఇవ్వండీ అని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా ఒక పోరాటంతో స్టార్ట్ చేసేవారు. నీరు గురించి గాని, మంచినీటి సమస్య విషయంలో అయితే ఆరోజు పంచాయతీరాజ్ శాఖా మాత్యులు శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు గారు ఈయన మొర విని, ఈయన గిరిజనుల పట్ల చూపిస్తున్న చొరవతో ఎక్కువ నిధులు కూడా ఆరోజు ఇవ్వడం జరిగింది. అలాగే మా యువ నాయకుడు శ్రీ నారా లోకేష్‌గారు కూడా... మా జిల్లాలో అందరం కూడా లోకేష్‌గారి దగ్గరికి వెళ్లి చాలా బాధ పడ్డాం. అరకు నియోజకవర్గానికి ఇచ్చినన్ని నిధులు ఏ నియోజకవర్గానికీ ఇవ్వలేదు. ఆ విషయంలో కూడా మాతో కూడా ఒక సోదరభావంతో "మీరందరూ కూడా సహకరించాలి అన్నా, మనందరం ఒక కుటుంబం, మా భూ విస్తీర్ణంలో సగం విస్తీర్ణం గిరిజన ప్రాంతం ఉంది కాబట్టి అందుకే సగం కంటే ఎక్కువ నిధులు మా యువ నాయకుడు శ్రీ నారా లోకేష్‌గారు నిధులు ఇచ్చారని" కూడా చాలా సందర్భాల్లో చెబుతూ ఉండేవారు. ఆయన వేరే పార్టీలో గెలిచినా, మా ముఖ్యమంత్రిగారు చేస్తోన్న అభివృద్ధి విషయంలో ఈయన ఆసక్తిని చూపి, ఆరోజు పార్టీ మారే మూడు రోజులు ముందు కూడా ఇక్కడున్న క్యాంటిన్‌లో కూర్చొని చర్చించుకోవడం జరిగింది. ఎప్పుడూ కూడా అభివృద్ధి. అభివృద్ధి దిశలో చెప్పేవాడు. సార్ నేను ఎమ్మెల్సీగా చూశాను, ఇద్దరు ముఖ్యమంత్రులను చూశాను, ఏ ముఖ్యమంత్రిగారికి కూడా... మన ముఖ్యమంత్రిగారికి (ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారినుద్దేశించి) ట్రైబల్ ఏరియాలో ఉన్న గిరిజనుల పట్ల ఉన్న మమకారం ఇంతవరకూ నేను ఎక్కడా చూడలేదని, వేరే పార్టీ శాసనసభ్యుడు అయినా మన ముఖ్యమంత్రిగారు చేసిన సేవల గురించి అను నిత్యం చెబుతూ ఉండేవారు. సభ్యులు శ్రీ బండారు సత్యనారాయణగారు చెప్పినట్లు చివరి రోజు మే అందరం కలిపి ఒకే వెహికల్‌లో ట్రావెల్ చేసేవాళ్లం, అప్పుడు కూడా చెప్పేవారు. "ప్రజల్లోకి వెళ్లకపోతే సమస్యలు తెలియవు, కానీ ఇక్కడ నక్సలైట్లను చూస్తే చాలా భయంకరమైన పరిస్థితి, వాళ్లు అర్థం చేసుకోవడం లేదు, ఆ బాక్సైట్ కూడా అసలు ఏ పరిస్థితిలో కూడా.. మన గౌరవ ముఖ్యమంత్రిగారు ఒక మంచి ఆలోచనతో గత పాలకులు చేసిన తప్పుల్ని మళ్లీ చాన్స్ ఇవ్వకూడదనే ఉద్దేశంతో బిల్లు పెట్టి ఆ బాక్సైట్ లీజులను రద్దు చేసి క్లోజ్ చేసినా సరే వాళ్లు అర్థం

చేసుకోకుండా ఇంకా మూర్ఖత్వంగా ఆలోచిస్తున్నారని చాలా ఆవేదనకు గురయ్యేవారు. ఆరోజు మేమంతా ఒకే కారులో ట్రావెల్ చేశాము. మన ముఖ్యమంత్రిగారు ఎంత మంచిగా చేస్తున్నారో, అయినా వాళ్లు అర్థం చేసుకోవడం లేదు" అని చెబుతూ, ఆరోజు కూడా ఈ సోమ మరియు సర్వేశ్వరరావు ఈ ఇద్దరు కూడా ఒక అన్నదమ్ముల కంటే ఎక్కువ. మనం గత చరిత్రలో రాముడు, లక్ష్మణుడు ఎలాగో, ఇద్దరూ వేర్వేరు పార్టీల్లో పోటీ చేశారు. వేర్వేరు పార్టీల్లో పోటీ చేసినా రాముడు, లక్ష్మణుడు వలె అను నిత్యం కలిసిమెలిసి తిరుగుతూ, సోమ కూడా ఒక అన్నదమ్ముణ్ణి ఎలా అయితే తీసుకొస్తాడో అలాగే సర్వేశ్వరరావుగారిని కూడా తీసుకొచ్చి ఆరోజు మా ముఖ్యమంత్రిగారి చేతుల మీదుగా కండువా వేసుకున్నప్పటి నుంచి, ప్రోగ్రామ్స్ కూడా. ప్రతీ గ్రామంలో, జిల్లాలో కూడా జిల్లా పరిషత్ మీటింగ్‌కు వచ్చినా, అసెంబ్లీకు వచ్చినా ఇద్దరూ కలిసి ఒకే కారులో ట్రావెల్ చేసి ఎప్పుడూ కూడా, అను నిత్యం ఇద్దరూ కూడా గిరిజన ప్రాంతం అభివృద్ధి విషయంలో ఒక అన్నదమ్ముల్లా, రామ లక్ష్మణుడు లాగా, చరిత్రలో మనం విన్నాము తప్ప, నిజ జీవితంలో కూడా వాళ్లిద్దర్నీ చూశాము. వాళ్లు అలా తిరగడమే కాదు, నియోజకవర్గ అభివృద్ధే కాదు, గిరిజనుల పట్ల సంక్షేమ కార్యక్రమాలు... గిరిజనులకు 50 సంవత్సరాలకే ఎన్‌టిఆర్ భరోసా కింద పింఛన్లు ఇస్తున్నారు. ఆరోజు మన ముఖ్యమంత్రిగారు 50 సంవత్సరాలకే గిరిజనలకు పింఛన్లు మంజూరు చేసినప్పుడు ఆయన ఆనందానికి హద్దులు లేవు. నాకు అయితే చాలా ఆశ్చర్యం అనిపించింది. నిజంగా ఇలాంటి వ్యక్తిత్వం కలిగిన మనుషులు ఈరోజు కూడా ఉంటారా అని అనిపించింది. తన ఇంట్లో వారికి వస్తే ఎంత ఆనందపడతాడో ఆ ట్రైబల్స్ అందరికీ కూడా మా గౌరవ ముఖ్యమంత్రిగారు ఇచ్చిన ఎన్‌టిఆర్ భరోసా కింద 50 సంవత్సరాలకే పింఛన్లు ఇచ్చేసరికి చాలా ఆనందపడిపోయారు. ఆరోజు సాయంత్రం సోమ, సర్వేశ్వరరావులతోపాటు నేను కూడా కూర్చోవడం జరిగింది. రామ, లక్ష్మణుడు లాగా వాళ్లిద్దరూ కూడా ఉన్నారు. అలాగే దురదృష్టం కూడా, దయుక్తిగా వాళ్లు ఇక్కడ లేకపోయినా వాళ్ల ఆత్మలు మాత్రం... ఇద్దరూ కలిసే ఉంటారు. దురదృష్టం... ఇద్దరూ కలిసే రాజకీయాలు చేశారు. అలాగే రాజకీయాల్లో పోటీ పడ్డారు. గెలిచిన తర్వాత కూడా అలాగే కలిసే ఉండి, అలాగే దురదృష్టవశాత్తు ఆ మరణం కూడా ఇద్దరూ కలిపి ఒకే సమయాన, చూడండి అధ్యక్షా. విధి. నా దగ్గర పనిచేసిన గన్‌మెన్ కూడా ఆరోజు అక్కడ ఉన్నాడు. ఆయన చెప్పాడు. "చాలా రిక్వస్ట్ చేశాడు. నేను తప్పు చేస్తే చెప్పండి, నేను రిజైన్ చేసి ఇంట్లో కూర్చొంటాను. నేను రాజకీయాల నుంచి వైదొలుగుతాను. కానీ ముఖ్యమంత్రిగారు బాక్సైట్ విషయంలో చాలా కుప్తంగా ఒక ఆర్డినెన్స్ తీసుకొచ్చారు" అని చెప్పినా దుర్మార్గంగా, వాళ్ల ఉనికిని చాటుకోడానికి, కేవలం మావోయిస్టులు వాళ్ల ఉనికిని చాటుకోవడం తప్ప, ఈ ఇద్దరి విషయంలో మాత్రం మా గిరిజన ప్రాంతంలో ఇప్పుడే కాదు, ఆరోజు నుంచి ఈరోజు వరకూ కూడా ప్రతీ ఒక్క గిరిజనుడూ

కూడా ప్లెయిన్ ఏరియాలోనే కాదు కింద దిగువ ప్రాంతంలో ఉండే ప్రతీ మతం, ప్రతీ కులం వాళ్లు ఆ విషయంలో అందరూ కూడా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆరోజు అయితే మా విశాఖపట్నం జిల్లా అంతా ఒక దుఃఖ సంద్రానికి లోనయింది. అందరూ గ్రామ దర్శినిలో తిరుగుతున్నారు. ఆ కబురు తెలియగానే ఎవ్వరూ కూడా భోజనం చేయలేదు కదా కనీసం మంచినీళ్లు కూడా తాగలేదు. మేమే కాదు అందరూ. యావత్తు జిల్లా ప్రజానీకం అంతా కూడా ఒక మంచి కార్యక్రమానికి వెళ్లేటప్పుడు ఇలాంటి దుర్ఘటన జరగడం చాలా దారుణమని అందరూ బాధ పడ్డారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఏ ఒక్కరూ కూడా (బెల్స్) ఇలా ఊహించలేదు. వాళ్ల కుటుంబాల పట్ల మన ముఖ్యమంత్రి గారు చూపించిన ఆ ఉదారత, ఆ మంచితనం, ముఖ్యమంత్రిగారితోపాటు లోకేష్‌బాబు గారు కూడా వాళ్ల కుటుంబాలను పలకరించి, అక్కడే వాళ్లకు నిధులు కూడా, ఆ నియోజకవర్గాన్ని ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నందుకు, అలాగే ఈరోజు నిధులు కూడా ఎక్కువగా ఆ గిరిజన ప్రాంతాలకు మా ముఖ్యమంత్రిగారు మంజూరు చేస్తున్నారు.

అలాగే ఆ సోమ గారి స్వగ్రామం. ఆ సోమగారి మీద ఉన్న మమకారంతో మా ముఖ్యమంత్రిగారి దత్తత గ్రామం కూడా సోమ స్వగ్రామమే. ఆ గ్రామాన్ని కూడా మా ముఖ్యమంత్రిగారు దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్నారు. అలాగే వాళ్ల కుటుంబాల పట్ల చూపించిన మమకారానికి మా జిల్లా యావత్తు అందరూ కలిపి, మా ముఖ్యమంత్రిగారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే ఆ కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సోమగారి కుటుంబానికి, సర్వేశ్వరరావుగారి కుటుంబానికి అలాగే ఆ ఇద్దరి ఆత్మలకు కూడా శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు మీకు కూడా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకొంటున్నాను అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్: కల్పనగారూ.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు): ధన్యవాదాలు అధ్యక్షా. స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావుగారు, సివేరి సోమ గార్ల మరణం, మావోయిస్టులు కిరాతకంగా వారిద్దర్నీ కూడా సెప్టెంబరు 23వ తేదీ, 2018న పొట్టనపెట్టుకోవడం, వారిద్దరూ ఆ కాల్పుల్లో మరణించడం చాలా దురదృష్టం. మావోయిస్టుల కిరాతక చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. మరి ఈరోజు కిడారి సర్వేశ్వరరావును చూస్తే చాలా మృదు స్వభావి, మంచి వ్యక్తి. నాయకత్వ లక్షణాలున్న వ్యక్తి. మన ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా వీకర్‌సెక్షన్స్‌లో అలాంటి నాయకత్వం లక్షణాలున్న వ్యక్తి దొరకటం చాలా కష్టం. అలాంటి సర్వేశ్వరరావుగారు చిన్న వయసులోనే,

అతి తక్కువ సమయంలో ఆయన అనేక పదవులను అలంకరించి వారు శాసనసభలో ఎమ్మెల్యేగా గెలవటం, గెలిచిన దగ్గర్నుంచీ కూడా ఆయన ప్రజలకు సేవ చేయాలి, అదేవిధంగా గిరిజన ప్రాంతమైన అరకుని అభివృద్ధి చేయాలీ అన్న తపనతోనే ఆయన రోజూ కూడా పనిచేస్తూ ఉండేవారు. ఎప్పుడూ సెక్రటేరియేట్‌లో గాని, ఈ ఆవరణలో చూసినా చేతిలో చాలా ఫైల్స్, అనేక రిప్రజెంటేషన్స్ పట్టుకొని తిరుగుతూ ఉండేవారు. ఆయన అందర్నీ కూడా సోదరభావంతో చూస్తూ అక్కా, అక్కా అని పిలుస్తూ, ఏంటి తమ్ముడూ అవి అని అంటే, ఇవన్నీ కూడా రిప్రజెంటేషన్స్ అక్కా మా ప్రాంతం ఎంతో వెనుకబడి ఉంది, దానిని అభివృద్ధి చేయాలి. విద్యా పరంగా, ఉద్యోగ పరంగా, అదేవిధంగా రోడ్లు, విద్యుత్ ఈ సౌకర్యాలన్నీ కూడా చాలా తక్కువ ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ సౌకర్యాలు లేని ప్రాంతాలన్నీ కూడా అభివృద్ధి చేయాలి. కాబట్టి మంత్రులను కలిసి ఈ రిప్రజెంటేషన్స్ ఇస్తున్నాను అని ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. స్కూల్స్ లేక అనేకమంది పిల్లలు విద్యకు దూరం అవుతున్నారని చెప్పి గౌరవ ముఖ్యమంత్రిగారిని అభ్యర్థించి రెసిడెన్షియల్ హాస్టల్స్ ఏవైతే ఉన్నాయో వాటిల్లో సీట్లు కూడా పెంచే ప్రయత్నం ఆయన చేసి కృతకృత్యులయ్యారు. సీట్లు కూడా పెంచడం జరిగింది. దానివల్ల ఎంతోమంది గిరిజన పిల్లలు విద్యకు దగ్గరవ్వటం, అనేకమంది విద్యార్థులు కూడా బాగా విద్యను అభ్యసించటం కూడా జరిగింది.

11.50 AM

అదేవిధంగా రోడ్ల కోసం ఎక్కువ నిధులు తీసుకొచ్చి దాదాపు రూ.180 కోట్లతో ఆ ఏరియాలో రోడ్లు వేయించడం చాలా అభినందనీయం.

అలాగే హాస్పిటల్ వసతులు, గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఎంతో ఇబ్బందిపడుతున్న సమయంలో అక్కడున్న పీఎచ్‌సీలను సీఎచ్‌సీలుగా మార్చాలని ఆయన పడిన తపన కూడా అభినందనీయం. మాజీ మంత్రి గారు చెప్పినట్లు దానిని అప్‌గ్రేడ్ చేయడమే కాకుండా, వైద్యం కోసం ఎవరైతే ప్రజలు వస్తున్నారో వారికి 24 గంటలు వైద్య సౌకర్యాలు కల్పించాలని, దానికి మాజీ మంత్రిగారు కూడా ఒక ప్రతిపాదన కూడా చేశారు, వారి ప్రతిపాదనను కూడా నేను బలపరుస్తున్నాను, ఆయన పదవీ కాలంలో హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేసి తీసుకొచ్చారో ఆ హాస్పిటల్‌కు కిడారి సర్వేశ్వర రావు గారి పేరు పెడితే బాగుంటుందన్న ప్రతిపాదనను నేను బలపరుస్తున్నాను.

అదేవిధంగా మావోయిస్టులు ఆయనను అపార్థం చేసుకొని ప్రజా సేవకున్ని, ప్రజా నాయకున్ని, ప్రజల కోసం పరితపిస్తున్న సేవకున్ని పొట్టనపెట్టుకోవడం చాలా కిరాతకం. బాక్సైట్ లీజులు రద్దు

చేసినప్పటికీ వాళ్లను ఎంకరేజ్ చేస్తున్నారన్న అపోహతో శ్రీ కిడారి సర్వేశ్వర రావు గారిని, మాజీ ఎమ్మెల్యే శివేరి సోమ గారిని పొట్టనపెట్టుకోవడం కిరాతక చర్య, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో హింసకు తావు ఉండకూడదు. ఎదుగుతున్న నాయకుల్ని ఆ రకంగా పొట్టనపెట్టుకొని గిరిజన ప్రాంతవాసులందరికీ కూడా మావోయిస్టులు అన్యాయం చేశారని తెలియజేస్తున్నాం. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఇకనైనా వారు ఆయుధాలు వదలి, ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పట్ల స్పందిస్తున్న నాయకులకు మద్ధతు తెలియజేయాలని మావోయిస్టులను కోరుతున్నాం.

ఈ సమయంలో మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వారి కుటుంబాలను ఆదుకున్న తీరు కూడా ప్రసంశనీయం. వారి కుటుంబాలకు, గిరిజన ప్రజలకు, కిడారి సర్వేశ్వర రావు గారిని ఎవరైతే గెలిపించారో వారందరికీ ధైర్యాన్ని, భరోసాను కల్పించేవిధంగా వారి కుటుంబంలో మంత్రి పదవి ఇవ్వడం గానీ, ఆర్థికంగా, ఉద్యోగపరంగా వారందరికీ అండగా నిలిచి, ఆ కుటుంబ సభ్యులకు భరోసాను, భద్రతను కల్పించారు. అన్ని రకాలుగా వారు ఆదుకున్న తీరు కూడా ప్రసంశనీయం. ముఖ్యమంత్రి గారికి కూడా మా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. ఒక వీకర్ సెక్షన్ నుంచి వచ్చిన శాసనసభ్యురాలిగా, ముఖ్యమంత్రి గారు ఆదుకున్న తీరు కూడా చాలా ప్రసంశనీయమని తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రి గారు ఈరకంగా అండగా ఉండడం మిగతా శాసనసభ్యులకు కూడా ఎంతో ధైర్యాన్ని, భరోసాను కల్పించిందని తెలియజేస్తున్నాను.

ఎవరైతే ఇద్దరూ, మావోయిస్టుల కాల్పుల్లో మరణించారో వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ ఃజవహర్ గారూ.

శ్రీ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ ఃఅధ్యక్షా...

(ఈ సందర్భంలో సభా నాయకుడు తాను మాట్లాడడానికి అవకాశం కల్పించాలని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ ఃఎస్, ముఖ్యమంత్రి గారూ.

శ్రీ నారా చంద్రబాబు నాయుడు : అధ్యక్షా, కౌన్సిల్‌లో ఎంవీవీఎస్ మూర్తి గారి సంతాప తీర్మానం ఉంది. దానికి కూడా నేను రిప్లై ఇవ్వాలి. చనిపోయిన వారి కుటుంబాలను పూర్తిగా ఆదుకుంటాం. సర్వేశ్వరరావుగారిని తేలేము గానీ వారి స్ఫూర్తిని ఒక ఆదర్శంగా తీసుకొని ఏవిధంగా ముందుకు పోవాలో ఆవిధంగా అన్ని కార్యక్రమాలూ చేపడతాం.

ఎక్కడైతే అంత్యక్రియలు చేశామో పాడేరులో ఒక మెమోరియల్‌ను క్రియేట్ చేస్తున్నాం. వంద పడకల ఆసుపత్రికి సర్వేశ్వర్ రావు గారి పేరు పెడతాం, ఎందుకంటే ఆయన దాని కోసం ఎంతో కృషి చేశారు.

(ఈ సందర్భంగా సభ్యులు బల్లలు చరిచారు)

శ్రీ కిడారి సర్వేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే శ్రీ శివేరి సోమలను మావోయిస్టులు దారుణంగా చంపేశారు. రెండు కుటుంబాలను ఆదుకుంటాం. నియోజకవర్గం హెడ్‌క్వార్టర్ అరకులో ఒక గుర్తింపుగా ఇద్దరి విగ్రహాలను పెట్టి, ఎప్పటికప్పుడు వారిని జ్ఞాపకం చేసుకోవడానికి, ఒక స్ఫూర్తినివ్వడానికి చర్యలు తీసుకుంటాం.

(ఈ సందర్భంగా సభ్యులు బల్లలు చరిచారు)

లివిటిపుట్టు స్పాట్‌లో ఈ ఇన్సిడెంట్ జరిగిందో అక్కడ ఒక మెమోరియల్‌ను క్రియేట్ చేసి, వారి జ్ఞాపకార్థం ఇద్దరి విగ్రహాలను పెట్టడానికి శ్రీకారం చుడతాం. ఇవన్నీ కూడా ఒక జ్ఞాపకంగా పెడుతూనే, అవతలి వ్యక్తులు కూడా గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఇలాంటి చాలా దారుణాలు చేసి మీరు (మావోయిస్టులను ఉద్దేశించి) సాధించింది ఏమీ లేదు, కానీ నిండు ప్రాణాలు తీసుకున్నారు, అది తప్ప మీరు సాధించింది ఏమీ లేదు.

ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ కూడా ఇంకా ఏవిధంగా చేస్తే ఆ కుటుంబాలు అనే కాకుండా ఆ ప్రాంతంలో ఉండే ప్రజానికానికి ఏవిధంగా మేలు జరుగుతుందో ఆ కార్యక్రమాలు అన్నీ చేస్తాం. భవిష్యత్‌లో మంత్రి శ్రావణ్ కుమార్ గారి అధ్వర్యంలో అరకు నియోజకవర్గానికి, ఇప్పటికే ఆ నియోజకవర్గంలో చాలా కార్యక్రమాలు చేశాం. ఒకసారి వాటిని చూస్తే.. ఈరోజు ఫారన్ నుంచి ఎవరు వచ్చినా అరకు కాఫీని మనం ప్రమోట్ చేసే పరిస్థితికి వచ్చాం. One of the best coffee, అలాంటి కార్యక్రమాలు చేసి Organic Agriculture కు కూడా ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. టూరిజం కూడా

పెద్దయెత్తున ప్రమోట్ అవుతోంది. ఇటీవల Balloon Festival కూడా పెట్టారు. ఇవన్నీ ఆయన కోరిక, ఆయన ఆలోచన. వీటిని ముందుకు తీసుకొపోతామని తెలియజేస్తున్నాను.

వారు గుర్తుండేవిధంగా, వారి స్ఫూర్తి ఎల్లప్పడూ ఆ ప్రాంతంలో ఉండేవిధంగా కార్యక్రమాలు చేపడతామని తెలియజేసుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేసుకుంటూ, వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ ఃజవహర్ గారూ.

శ్రీ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ (కొప్పూరు)ఃఅధ్యక్షా, శ్రీ కిడారి సర్వేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యే శ్రీ శివేరి సోమల మృతికి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నాను. గిరిజన ప్రాంతాల్లో గానీ, దళిత ప్రాంతాల్లో గానీ, బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన నాయకత్వం విషయంలో, ఈ దుర్మార్గ చర్య వల్ల నాయకత్వం బలహీనపడే పరిస్థితి ఉంది. ఎవరి కోసమైతే పోరాడుతూ, ఆ గ్రామాల్లోని, ఆ ప్రాంతాల్లోని ప్రజల కోరికలను, ఆకాంక్షలను నెరవేరుస్తూ, వారి ఆశయాలకు అనుగుణంగా, స్ఫూర్తివంతమైన నాయకత్వాన్ని అందించిన నాయకత్వాన్ని తుదముట్టించడం అనేది దుర్మార్గమైన చర్యను మావోయిస్టులు చేయడం వల్ల అది బడుగు, బలహీనవర్గాల నాయకత్వంపై పడిందని, అనేక సందర్భాల్లో గత చరిత్ర చెబుతోంది.

ప్రాణం పోసే, ప్రాణాలు నిలబెట్టే హక్కు మీకు లేనపుడు ప్రాణం తీసే హక్కు మీకు లేదు అని ఈ సందర్భంలో మావోయిస్టులకు, టెర్రరిస్టులకు తెలియజేస్తున్నాను. విడువబడిన వ్యక్తుల కుటుంబాలకు చంద్రబాబు నాయుడు గారు భరోసాను ఇవ్వడంతో కొంత కోలుకున్న పరిస్థితి ఉంది. కానీ తండ్రి లేని బాధ బిడ్డలకు ఏవిధంగా ఉంటుందో, ఆ బాధ వారికి తెలిస్తే తప్ప అర్థమయ్యేది కాదు. ఎందుకంటే మానవ మృగాలుగా ఉండే పరిస్థితుల్లో.. ఎప్పటికైనా వ్యక్తుల నిర్మూలనల ద్వారా వ్యవస్థలు ఏర్పాటు అవుతున్నాయంటే అది కల అనే విషయాన్ని వారు అర్థం చేసుకొని, ఎలాంటి దుశ్చర్యలకు మరోమారు పాటుపడకుండా ఉండాలని కోరుతున్నాను.

అదేవిధంగా ఆ వ్యక్తుల ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలని మనసారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను అధ్యక్ష.

మిస్టర్ స్పీకర్ ः విష్ణుకుమార్ రాజు గారు.

శ్రీ పెన్మత్స విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం ఉత్తరం)ः ధన్యవాదాలు అధ్యక్షా, శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు వ్యక్తిగా, సహచర శాసనసభ్యుడిగా నాతో మంచి సంబంధాలు ఉండేవి. చాలా సౌమ్యుడు, ఎప్పుడూ కూడా చిరునవ్వుతో ఉండేవాడు. అటువంటి ఎమ్మెల్యేని చాలా దారుణాతిదారుణంగా నక్సలైట్స్ హతమార్చడం అనేది చాలా దారుణం. నక్సలైట్స్‌కు దమ్ము, ధైర్యముంటే 'ఓటు' అనే బుల్లెట్ ద్వారా ప్రజాస్వామ్యం మీద మీకు (నక్సలైట్లనుద్దేశించి) నమ్మకం లేకపోతే, ప్రజాస్వామ్యంపై దాడి చేయాలనుకుంటే ఓటు ద్వారా దాడి చేయాలి. ఓటును బుల్లెట్‌గా ఉపయోగించి, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేనిమూలాన, అటువంటి చర్చ ఏమైనా చేసినా ప్రజలు హర్షిస్తారు తప్ప, ఎన్నికల్లో మీరు నిలబడి, గెలిచి శాసనసభకు వచ్చే లేకపోతే పార్లమెంటుకు వెళ్లి ప్రజల సమస్యల గురించి, లేకపోతే మీకున్న భావాల గురించి అక్కడ చెప్పాలి. అంతేగాని, ఒక అమాయకమైన ఎమ్మెల్యేను హతమార్చి, మాజీ ఎమ్మెల్యేను హతమార్చడమన్నది దారుణాతిదారుణం, ఇది మానవ మృగాల కంటే చాలా దారుణం. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

12.00PM

మేము ఒక్కళ్లమే కాదు ప్రజాస్వామ్యం మీద నమ్మకం ఉన్న ప్రతీఒక్కరు ఖండిస్తారు. వాళ్లకు పోయింది ఒక బులెట్ మాత్రమే, కానీ ఇక్కడ ప్రాణాలు పోయాయి. అంటే ప్రజాస్వామ్యాన్ని గిరిజన ప్రాంత అభివృద్ధి గురించి పాటుపడే వ్యక్తి ఒక ఎమ్మెల్యేని చంపడం దారుణం. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. అలాగే గౌరవ ముఖ్యమంత్రిగారు వారి కుటుంబానికి కూడా ధైర్యాన్ని ఇచ్చి, చాలా సహాయసహకారాలు అందించారు. మేము వేరే పార్టీ అయినప్పటికీ కూడా ముఖ్యమంత్రిగారిని మేము అభినందిస్తున్నాం. ఎందుకంటే ఇటువంటి సమయంలో ఒక ఎమ్మెల్యేని గాని, లేకపోతే ఇతర వ్యక్తులను చంపినప్పుడు వారి కుటుంబాలు ఎంత శోకహృదయంతో ఉంటారనేది అందరికీ తెలుసు. అయినప్పటికీ అంతకుముందు ఏ ప్రభుత్వంమన్నా ఇంత పెద్ద ఎత్తున సహాయసహకారాలు అందించిందో లేదో నాకైతే తెలియదు కానీ గౌరవ ముఖ్యమంత్రిగారు చేసిన నిర్ణయాలకు మాత్రం మేము అభినందనలు తెలియజేసుకుంటున్నాం. అలాగే మా మాజీ మంత్రివర్యులు డా. కామినేని శ్రీనివాసరావు గారు వారు అంతకుముందు హెల్త్ మినిస్టర్‌గా ఉన్నారు. వారు చెప్పిన ప్రపోజల్ 100 పడకల ఆసుపత్రికి కూడా శ్రీ కిడారి సర్వేశ్వరరావుగారి పేరు పెట్టడానికి ముఖ్యమంత్రిగారు ఒప్పుకున్నందుకు మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మా మిత్రుడు అయిన శ్రీ

కిడారి సర్వేశ్వరరావు మరియు సోమ గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి మేము అండగా ఉంటామని చెప్పి మరొక్కసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

శ్రీ అత్తర్ చాంద్ బాషా (కదిరి)ః ధన్యవాదాలు అధ్యక్షా, సహచర శాసనసభ్యులు కీర్తి శేషులు శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు , సివేరి సోమ గారు మన మధ్యన లేకపోవడం ఆ కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు 2014వ సంవత్సరం నుంచి ఒక సహచర శాసనసభ్యుడిగా నాతో చాలా బాగా ఉండేవాడు. ఎప్పుడు ఏమి మాట్లాడినా తన నియోజకవర్గానికి సంబంధించి ప్రధానంగా గిరిజనుల యొక్క సమస్యల గురించి ప్రస్తావన తీసుకువచ్చేవారు. ఆయన చాలా సౌమ్యుడు, మంచి వ్యక్తిత్వం గల వ్యక్తి. అలాంటి వ్యక్తి ఈనాడు మన మధ్యలో లేకపోవడం, ఆనాడు నక్సల్స్ చేతుల్లో కిరాతకంగా కాల్చబడటం చాలా దారుణం. దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ఎందుకంటే, కొండల్లో, గుట్టల్లో ఉండి ఒక గిరిజన కుటుంబంలో పుట్టిన ఒక గిరిజనుడుగా నిరంతరం గిరిజన సమస్యల మీదుగా, మరీ ముఖ్యంగా విద్య, వైద్యం, రోడ్ల గురించి ఎప్పుడూ ప్రస్తావన తీసుకువచ్చే వారు. కానీ, ఆరోజు ఉండే పరిస్థితుల్లో ఆయన దాదాపు రెండు సంవత్సరాలు కూడా, నియోజకవర్గానికి నేను ఏమాత్రం న్యాయం చేయలేకపోతున్నాను, ఏ సమస్యా పరిష్కారం చేయలేకపోతున్నానని చెప్పి ఆనాడు గౌరవ ముఖ్యమంత్రిగారు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు నా వంతు సహకారం అందజేస్తే నా నియోజకవర్గం అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పి ఆరోజు ముఖ్యమంత్రిగారికి తన మద్దతుని ఇస్తూ, ఏదైతే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అందజేస్తున్న ప్రత్యేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు గిరిజనులకు అందే విధంగా తన పాత్రని పోషిస్తూ, మరీ ముఖ్యంగా రోడ్ల విషయంలో అయితే దాదాపు ఈఏపి కింద రూ.200కోట్లు వరకు గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు ఇవ్వడం, అభివృద్ధి చేయడం, అదేవిధంగా విద్య పట్ల ఏదైతే పిహెచ్‌సిలు ఉన్నాయో వాటిని సిహెచ్‌సిలుగా మార్చడం, జిల్లా ఆసుపత్రులు అనుసంధానం చేయడం, 24గంటలు సేవలు అందించేలా చేయడం, విద్యపరంగా కూడా పిల్లల చదువులు మానుకోకుండా చేయడం, విద్యను ప్రోత్సహించే విధంగా ఈ ప్రభుత్వం చేస్తున్న పథకాలకు ఆయన ముందర ఉండి గిరిజనుల సోదరుల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేసే వ్యక్తిగా మరియు గిరిజనుల అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి శ్రీ కిడారి సర్వేశ్వరరావుగారని తెలియజేస్తున్నాను. ఆయన మన మధ్యలో లేకపోయినా కూడా ఆనాడు ఆ కుటుంబంలో ఒక పెద్దగా ఉన్న కిడారి సర్వేశ్వరరావుగారు హత్యకు గుర్తెనప్పుడు ఆ కుటుంబానికి కొండంత అండగా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఒక తండ్రి ఏవిధంగా అయితే కొడుకుకు నేనున్నానని ఏవిధంగా అయితే ఒక భరోసా ఇస్తాడో ఆవిధంగా ఆ

కుటుంబానికి అండగా నిలచి ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవడానికి చేసిన సహాయం మాత్రం నిజంగా జీవితంలో ఎవరూ కూడా మరచిపోలేరు. గతంలో కూడా చాలా ప్రభుత్వాలు ఉన్నప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా హత్యలు గావించినా కూడా ఇలాంటి నిర్ణయాలు ఏ ప్రభుత్వం తీసుకోకపోయినా ఈరోజు ముఖ్యమంత్రిగారు ఒక కొడుకు అని చెప్పి భావించి శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి కుటుంబానికి ఆర్థిక సహాయం గానీ, అదేవిధంగా ఈరోజు ఆయన కుమారుడుకి కేబినేట్‌లో స్థానం కల్పించడం గానీ, ఇంకొక కుమారుడుకి డెప్యూటీ కలెక్టర్ హోదా కల్పించడం గానీ, ఆయన కుమార్తెని ఎంబిబిఎస్ చదివించడం గానీ, ఇలాంటివన్ని చూసినప్పుడు ప్రతీ ఒక్కరిలో కూడా ఒక భరోసా వచ్చింది. ఏదైనా ఒక మాట ఇస్తే తనని నమ్ముకొని వచ్చిన వాళ్లకు న్యాయం చేస్తారని చెప్పి ఇదొక్కటే నిదర్శనమని ఆయన కుటుంబాన్ని ఆదుకున్న తీరు అని తెలియజేస్తున్నాను. (బెల్) సహజంగా కుటుంబంలో ఒక పెద్ద మనిషి చనిపోయినప్పుడు అన్నో, చెల్లో, తమ్ముడో ఆరోజు వచ్చి ఓదారుస్తారు. కానీ ఆ కుటుంబ కష్టాలు మరుసటి రోజు నుండి ఆ కుటుంబానికే తెలుస్తాయి. ఎంత దయనీయ స్థితిలో ఉంటాయో అలాంటి కుటుంబానికి గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు తండ్రిలాగా ఆయన చేసిన సహాయం, ఆయన చూపించిన అభిమానం ఆ తీరుని చూసినప్పుడు ప్రతీ ఒక్కరికి ఒక నమ్మకం కలుగుతుంది. కాబట్టి ఈరోజు ఆ కుటుంబానికి, అదేవిధంగా సివేరి సోమ గారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేసుకుంటూ ముగిస్తున్నాను. ధన్యవాదాలు.

శ్రీ పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) (విశాఖపట్నం పశ్చిమం): అధ్యక్షా, చాలా బాధాకరం. శ్రీ కిడారి సర్వేశ్వరరావుగారు గత శాసనసభలో నా పక్కనే కూర్చొనేవారు. ఎక్కువగా నగర వాతావరణంలోని శాసనసభ్యులకు, గిరిజన ప్రాంతంలో ఉన్న శాసనసభ్యులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అక్కడ ఉండేటువంటి సమస్యల పరిష్కారంలో ఎక్కువగా సుదూర ప్రాంతాలకు దారులు లేనటువంటి, రోడ్లు లేనటువంటి ప్రాంతాలకు నిత్యం పర్యటించాలి, ఎక్కువగా ఆ సమస్యల పరిష్కారంలో మాకూ, వారికి ఉండే వ్యత్యాసాలు మాట్లాడుతున్నప్పుడు ప్రధానంగా ఈ నక్సల్స్ threat గురించి కూడా చెప్పడం జరిగేది. అది ఉన్నా కూడా ఆ డెవలప్‌మెంటల్ యాక్టివిటిస్‌లో ముఖ్యంగా ఇందాక సభ్యులు శ్రీ బండారు సత్యనారాయణమూర్తి గారు చెప్పినట్లు ఒకవైపు అధికార పార్టీలో ఉన్నా లేదా ప్రతిపక్షంలో ఉన్నా తన వాణిని ఏ వేదికపైన అయినా... మనం అసెంబ్లీలో కూడా చూశాం. అక్కడ కూర్చొని ఉన్నప్పుడు చాలా చక్కగా ప్రస్తావించే వారు. అదేవిధంగా జిల్లా పరిషత్తులో కూడా నిత్యం ఒక పోరాటమే చేసేవారు. అదేవిధంగా మనం చూసినప్పుడు అభివృద్ధి గురించి, సంక్షేమం గురించి, ముఖ్య మంత్రిగారు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఆయన తీసుకున్న నిర్ణయం వల్ల అక్కడ గిరిజన అభివృద్ధి

జరుగుతుందనేది వారు నమ్మి ఆయన తీసుకున్న నిర్ణయం చాలా హర్షాతిరేకం. అక్కడ ఉండే ప్రజల్లో కూడా ఒక భరోసా కలిగింది. ముఖ్యంగా నేను చూసినప్పుడు .... అసెంబ్లీ కండెక్టు చేసిన ఆటల పోటీల్లో కూడా చాలా యాక్టివ్‌గా వీరు పార్టిసిపేట్ చేశారు. అది చూసినప్పుడు ఆయన చనిపోయేదాకా అంత పెద్ద అబ్బాయి ఉన్నాడనేది కూడా తెలియదు, ఆయన వయసు తెలిసింది, చాలా యంగ్‌గా, ఎప్పుడూ చురుకుగా కనిపిస్తూ ఇందాక మా చీఫ్ విప్ గారు చెప్పినట్టు చాలా లో ప్రొఫైల్ మెయింటైన్ చేసేవారు, చిన్న వ్యక్తితో గాని, తక్కువ పదవి ఉన్న వ్యక్తితోగానీ, లేకపోతే ఎంత వయసు ఉన్నటువంటి వ్యక్తితో అయినా గానీ చాలా గౌరవంగా, respectable గా ఉండేటువంటి వ్యక్తి, చాలా లో ప్రొఫైల్ మెయింటైన్ చేసే వ్యక్తి. అలాంటి వ్యక్తిని ఈరోజు కొల్పోవడం, ఒక దుశ్చర్య, నక్సల్స్ చేతిలో మరణించడం, ముందుగానే ఆయనకు తెలిసినట్టుగానే, ఆయన ప్రస్తావించే ప్రతీ సందర్భంలో కూడా, ఆయన మాటల సందర్భంలో తెలుస్తూ ఉండేది, అలాంటి వ్యక్తి ఈరోజు లేకపోవడం చాలా బాధాకరం. ముఖ్యమంత్రి గారు ఆయన కుటుంబానికే కాదు గిరిజన ప్రాంతానికే ఒక భరోసా ఇచ్చారు.

మ.12.10

మన పగవారు చనిపోయినా కూడా మనం బాధపడతాం. అంతో ఇంతో పరిచయం ఉన్నవారు చనిపోతే ఇంకా కుమిలిపోతాం. ఎక్కువ కాలం అనుబంధం ఉన్నవారు ఇలాంటి మరణం చెందితే దిగ్భ్రాంతికి గురవడమే కాకుండా వారి కుటుంబసభ్యుల దగ్గరకువెళ్లి వారిని పరామర్శిస్తాం. వారి మరణవార్త తెలియగానే మేం విశాఖపట్నం నుంచి అరకు వెళుతుంటే ఆ దారిలోనే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు పాదయాత్రలో భాగంగా ఆ ప్రాంతంలో ఉన్నారు. వారున్న ప్రాంతానికి సుమారు 40, 50 కి.మీ. దూరంలో ఆ సంఘటన జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, మనమందరం కూడా దిగ్భ్రాంతికి గురయ్యాం. గిరిజన ప్రాంతమంతా కూడా దిగ్భ్రాంతికి గురైనది. మేం శాసనసభ్యులుగా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కూడా ఆ ప్రాంతంలో ఉన్నారు కాబట్టి మృతుల కుటుంబాలను పరామర్శిస్తారని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. ఆరోజు జరిగిన సంఘటన ద్వారా గిరిజనులకు చాలా అన్యాయం జరిగిందని మేం భావిస్తున్నాం. గిరిజనులలో, వారి కుటుంబ సభ్యులలో ధైర్యం నింపే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు స్పందించారు. గిరిజన ప్రాంతాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల మధ్య తిరగకూడదనే విధంగా జరిగే ఇలాంటి చర్యలను మనమందరం ఖండించాలి. అలా ధైర్యం కలిగించే విధంగా ముఖ్యమంత్రిగారు సర్వేశ్వరరావుగారిని శ్రావణ్‌కుమార్‌లో చూసుకుంటూ, గిరిజన ప్రాంతం మరింత అభివృద్ధి చెందే విధంగా నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు, గిరిజన ప్రాంత ప్రజలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

శ్రీ మోదుగుల వేణుగోపాలరెడ్డి (గుంటూరు పశ్చిమం)ః అధ్యక్షా, అరకు ప్రకృతి సౌందర్యానికి నిలయమైతే మృతి చెందిన అరకు శాసనసభ్యులు మానసిక వికాసానికి, ఎపుడూ నవ్వుతూ పది మంది మనసు చూరగొన్న శాసనసభ్యులు ప్రస్తుతం మన మధ్య లేరంటే నిజంగా బాధాకరం. వారితోబాటు మాజీ శాసనసభ్యులు శ్రీ సివేరి సోమ కూడా మరణించడం, శాసనసభలో ఈ రోజు వారి సంతాప తీర్మానంలో భాగస్వామిని కావడం మరింత బాధాకరం. మీద్వారా తెలియజేసేదేమంటే, ఈ శాసనసభలో ఇదే చివరి సంతాపంగా ఉండాలని నేను భావిస్తున్నాను. నేను కమిటీ చైర్మన్‌గా, సర్వేశ్వరరావుగారు, ఇతరులు సభ్యులుగా మేం 2015 మార్చి నెలలో కమిటీ పర్యటనలో భాగంగా జమ్మూ కశ్మీరులోని లడాఖ్ ప్రాంతానికి వెళ్లాం. అపుడు మాతోబాటు ప్రస్తుత మంత్రివర్యులు, దివంగత సర్వేశ్వరరావుగారి తనయుడు శ్రావణ్‌కుమార్ కూడా మాతోబాటు ఉన్నారు. చాలా కరేజియస్ ప్రాంతం. Almost we have been to Siachen Glacier, 23,000 ft. above ఉన్నటువంటి సైనిక స్థావరాలకు కూడా వెళ్లాం. అక్కడున్న సైనిక సిబ్బంది స్లోగన్స్ కానీ, God may mercy upon my enemies because I won't, అంటే దేవునికైనా నా శత్రువుపై కృప ఉంటుంది కానీ నాకు ఉండదనే భావనతో మిస్‌ఫైర్ అయి తండ్రి చనిపోయినపుడు కుమారుడు బాధ్యతలు తీసుకున్న విధం చూస్తే ఈ దేశ రాజకీయాలలో సక్సెసర్ పాలిటిక్స్ ఎపుడు కూడా సమాజం నుంచి తీసుకోవడం ఎక్కువ, ఇవ్వడం తక్కువనే భావన ఉంది. అందుకని నేను ఈరోజు ముఖ్యంగా శ్రావణ్‌కుమార్‌కు చెప్పేదేమంటే, తండ్రిగారి అడుగుజాడలలో నడవడంతోబాటు వారి ఆశయాలకు పాటుపడడం ఆయన కుమారుడిపై ఉన్న పయస్ ఆబ్లిగేషన్ అంటే పవిత్ర బాధ్యత. రాష్ట్ర ముఖ్యమంత్రిగారు వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉన్నారు. కానీ రాబోయే రోజులలో శ్రావణ్‌కుమార్‌గారు రాజకీయంగా ఎదగాలని, వారికి ఆ శక్తి భగవంతుడు ఇవ్వాలని కోరుకుంటున్నాను. I pray the Almighty that both the souls may rest in peace అనే భావనతో నేను ఈ శాసనసభ ముందు ఉంచుతున్నాను. ఇంకొకటి కూడా ఈ శాసనసభలో తీర్మానం చేయాలని నేను కోరుతున్నాను. నక్సల్స్ కోరుకున్నదానికి ఇంటెలిజెన్స్ విభాగం వైఫల్యం కూడా కారణమనే భావన నాలో బలంగా ఉంది. రాబోయే రోజులలో శాసనసభ్యులను ముఖ్యంగా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలలో ఉన్న శాసనసభ్యులను రక్షించుకోవాల్సిన బాధ్యత ముఖ్యంగా రాష్ట్ర హోంశాఖపై, ముఖ్యంగా పోలీసుశాఖపై ఉంది. సంఘటన జరిగిన తర్వాత ఫోటోలకు దండవేసే కాన్సెప్ట్ కన్నా అంటే పోస్ట్ మెథడ్ కంటె ప్రీ మెథడ్ ఉంటే బాగుంటుందని నా సూచన. ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకుండా పోలీసు శాఖ సమర్థవంతంగా ముందుకు వెళ్లాలని కోరుతున్నాను. మృతి చెందిన శాసనసభ్యులు శ్రీ కిడారి సర్వేశ్వరరావుగారి ఆత్మకు శాంతి చేకూరాలని నేను కోరుతున్నాను. గుంటూరు పశ్చిమ శాసనసభ్యుడిగా నేను వారి కుటుంబానికి కొండంత అండగా

ఉంటూ రాబోయే రోజులలో ఈ శాసనసభలోని సభ్యులందరూ కూడా తప్పకుండా అండగా ఉంటామని తెలియజేస్తున్నాను. కిడారి సర్వేశ్వరరావుగారికి, మాజీ శాసనసభ్యులు శ్రీ సివేరి సోమల ఆత్మలకు శాంతి కలగాలని ఆ భగవంతుని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు)ః అధ్యక్షా, ఈ సభకు తొలిసారిగా ఎన్నికైన శాసనసభ్యులు శ్రీ సర్వేశ్వరరావుగారి హత్య గురించి ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యవాదులైన అందరూ కూడా ఖండించాలి. ఎందుకంటే గిరిజన వర్గాలలో రాజకీయాలలోకి వచ్చినవారు అతి తక్కువగా ఉంటారు. చదువుకొన్న యువకునిగా రాజకీయాలలోకి వచ్చి ఆదర్శవంతమైన ఆలోచనలు, భావాలతో వారు పనిచేస్తున్నారు. ఈ సభకు ఎన్నికైన తరవాత మా అందరితో కలిసినపుడు మాతో వారు ఎన్నో ఆలోచనలు పంచుకున్నారు. గిరిజన ప్రజానీకం ఆలోచనలను, ఆకాంక్షలను, సమస్యలను, తనకున్న అభిప్రాయాలను ఈ సభలో వారు చెప్పిన విషయాలను మనం ఒకసారి గుర్తుంచుకోవాలి. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం తపించే నాయకుడు సర్వేశ్వరరావుగారు. మనది ప్రజాస్వామ్య దేశం, ప్రజాస్వామ్య దేశంలో హింసకు తావులేదు. అటువంటి పరిస్థితులలో సైద్ధాంతిక విబేధాలు ఉంటాయి. కానీ సైద్ధాంతిక విబేధాలతో హత్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించాలి. రాష్ట్రంలోని గిరిజన ప్రజానీకం ఒక మంచి నాయకుడిని కోల్పోయింది. ఆ వర్గాలనుంచి నాయకత్వం చాలా తక్కువగా వచ్చే పరిస్థితుల్లో స్వశక్తితో పైకెదిగిన నాయకులను హత్య కావించడమంటే ఆవర్గాలకు అన్యాయం చేసినట్లవుతుంది. అటువంటి సర్వేశ్వరరావు ఇవాళ మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. వారు తన నియోజకవర్గ అభివృద్ధికోసం నిబద్ధతతో పనిచేశారు. ఆ ప్రాంతంలో గిరిజనులకు కావలసిన మౌలికసదుపాయాలైన ఆసుపత్రులు, విద్య, రోడ్లు గురించి వారు నిరంతరం కృషిచేశారు. గిరిజన వర్గాలలో ఒక మంచి నాయకుడిని మన రాష్ట్రం కోల్పోవడం చాలా బాధాకరం. వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ వారి కుటుంబానికి నా సానుభూతిని తెలియజేస్తున్నాను. ఆ సమయంలో వారితో ఉన్న మాజీ శాసనసభ్యులు శ్రీ సివేరి సోమ కూడా మా సహచరుడిగా 2009-14 మధ్య ఈ సభలో సభ్యులుగా ఉన్నారు. అపుడు మేం ప్రతిపక్ష సభ్యులుగా మేం ఎన్నో ఉద్యమాలు చేసినపుడు, ప్రభుత్వం మీద పోరాటం చేసేటప్పుడు వారు సహాయ సహకారాలు అందించారు. అటువంటి వ్యక్తులను హత్య కావించడాన్ని తీవ్రంగా ఖండించాల్సిన అవసరముంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎవరైనా నక్సల్స్‌చే హత్య కావించినపుడు ఆయా నియోజకవర్గాలలో ఇతరులు ఎవరూ పోటీచేయకుండా ఆ కుంటుంబంలోని సభ్యులకు ఏకగ్రీవం చేయాలనే ఆలోచన చేసి ముఖ్యమంత్రిగారు గతంలో ఈ సభలోనే

తీర్మానం చేశారు. ఆ విధంగా మృతులైన శాసనసభ్యులకు అండగా ఉండి వారి కుటుంబ సభ్యులు ఆత్మస్థైర్యంతో తిరిగి నిలబడే విధంగా ముఖ్యమంత్రిగారు అండగా నిలబడడాన్ని మనమందరం అభినందించాలి. వారి మృతి పట్ల వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

12.20 PM

శ్రీ నక్కా ఆనందబాబు (వేమూరు)ః అధ్యక్షా, తేది.23.09.2018, గిరిజనులలో పుట్టి, వారి మధ్య పెరిగి, వారికి నాయకత్వం వహిస్తూ వారి కోసమే జీవిస్తున్న ఒక ప్రజా ప్రతినిధి సర్వేశ్వరరావు గారిని నక్సలైట్లు అమానుషంగా హత్య చేసిన రోజు. ఆనాడు గిరిజన సంక్షేమ శాఖా మంత్రిగా పనిచేస్తున్న నాకు అనతి కాలంలోనే మంచి మిత్రుడిగా ఉన్న వ్యక్తి సర్వేశ్వరరావు గారు. నిత్యం నియోజకవర్గ అభివృద్ధి, అక్కడి ప్రజల యొక్క మంచి, చెడుల మీద ప్రత్యేక అవగాహనతో, వారి సమస్యల కోసం చిత్తశుద్ధితో పనిచేసిన నాయకుడు. అమరావతికి ఎప్పుడొచ్చినా సచివాలయంలో నన్ను కలవకుండా వెళ్లేవారు కాదు. ఆయన నా దగ్గరకు వచ్చారంటే ఆ ప్రాంతానికి సంబంధించిన సమస్యల చిట్టా... ఆ సమస్యల పరిష్కారానికి ఒక పరిష్కారం కనుగొనేంత వరకూ కూడా దగ్గరుండి, ఒక తపనతో, తాపత్రయంతో వాళ్ల బాధలు చెప్పి, ఆ సమస్యలు ఏ విధంగానైనా సరే తీర్చే విధంగా నిర్ణయాలు తీసుకున్న తరువాత వెళుతుండేవారు. ఆయన 22వ తేదీ సాయంత్రం కూడా నాతో మాట్లాడటం జరిగింది. అటువంటి వ్యక్తిని తెల్లారేసరికి నక్సలైట్లు పొట్టనబెట్టుకోవడమనేది చాలా విచారకరమైన సంఘటన. గిరిజన వర్గాలకు ఒక అండ. అరకు, పాడేరు ఏజెన్సీ ప్రాంతాల్లో ఒక అండ కోల్పోయిందనేది ఒక యధార్థం. చిన్నతనం నుంచే ఎన్నో కష్టాల మధ్య పెరిగిన వ్యక్తి సర్వేశ్వరరావు గారు. సామాన్యమైన కుటుంబంలో పుట్టి రాజకీయంగా ఒక ఉన్నతమైన స్థానంలో, ప్రభుత్వ విప్‌గా ఉండి అనేక సేవలు అందిస్తున్న సర్వేశ్వరరావు గారిని ఎందుకు హత్య చేశారో... ఈ రెండు హత్యలు కిడారి సర్వేశ్వరరావు గారిని మరియు మాజీ శాసనసభ్యులు, ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యుడిగా ఉన్న సివేరి సోమ గారిని ఎందుకు హత్య చేశారంటే ఈరోజు వరకూ సమాధానం దొరకని ప్రశ్నగా మిగిలిపోయిన పరిస్థితి. నక్సలైట్లు ఎవరైతే ఉన్నారో ఎందుకు హత్య చేశారో దానికి సంబంధించి ఈనాటికి కూడా సరైన ప్రకటన విడుదల చేయకపోవడం వాళ్ల యొక్క విధానం, వాళ్లు చేసిన పని కరెక్టు కాదని వారే చెప్పినట్లు అవుతోంది. కచ్చితంగా సమాజంలో ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది. ప్రజాస్వామ్యవాదులు గానీ, మేధావి వర్గాలుగా ఉన్న వారు గానీ, పౌర హక్కుల నేతలు గానీ, ప్రతీ ఒక్కరూ ఈ సంఘటనను ఖండించాల్సిన అవసరముంది. ఎందుకంటే ఈ హత్య జరిగినప్పుడు చూశాను. మేధావి వర్గాలుగా చెప్పుకునే వారు గానీ, పౌర హక్కుల నేతలు గానీ ఎవరూ స్పందించలేదు. చాలా దురదృష్టకరం. కచ్చితంగా ప్రతీ ఒక్కరూ ఖండించాల్సిన అవసరముంది. ఎందుకంటే గిరిజనుల కోసం ఏదో చేస్తున్నామని చెప్పే నక్సలైట్లు, గిరిజనుల మంచి చెడుల గురించి పోరాటాలు చేస్తున్నామని చెప్పే

నక్సలైట్లు, గిరిజనుల కోసం బ్రతుకుతున్న ప్రజా ప్రతినిధులను హత్య చేయడమనేది చాలా అమానుషం. దీనిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.

అధ్యక్షా, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, దశాబ్దాలుగా కనెక్టివిటీ లేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతూ, రహదారులు లేక ఇబ్బందిపడుతున్న రెండు వేల గ్రామాలకు పైగా unconnected habitations కి కనెక్టివిటీ తీసుకువచ్చిన ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం. నారా లోకేష్ గారు పంచాయతీ రాజ్ శాఖా మంత్రి అయిన తరువాత ఆ గ్రామాలన్నింటికీ కనెక్టివిటీ తీసుకుని వచ్చాము. అదేవిధంగా త్రాగునీటి వసతుల కల్పనకు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఆ గ్రామాలకు మంచినీరు అందించే కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఫైబర్ కనెక్టివిటీ తీసుకుని వచ్చి గ్రామాలన్నీ అనుసంధానం చేసి అనేక రకాలుగా అభివృద్ధి చేస్తున్న దశలో, అభివృద్ధిని చూసి ఓర్వలేని పరిస్థితుల్లో, ఆ అభివృద్ధిని ప్రజల మధ్యకు తీసుకు వెళుతున్న నాయకుడిగా ఉన్న సర్వేశ్వరరావు గారిని ఈ విధంగా అమానుషంగా హత్య చేయడం నన్ను తీవ్రంగా కలచి వేసింది. అటువంటి పరిస్థితుల్లో తండ్రులను కోల్పోయిన సర్వేశ్వరరావు గారి పిల్లలు గానీ, సోమ గారి పిల్లలు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ, వారిని ఓదార్చడం కోసం గానీ, వారికి అండగా నేనున్నాను అని తెలియచేసే విధానంలో వారికి అండగా నిలబడటంలో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు చూపించిన ఔదార్యాన్ని ప్రతీ ఒక్కరూ వేనోళ్ల కొనియాడారు. కచ్చితంగా వారికి అండగా నిలబడ్డ ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలియచేస్తూ వారు ఇచ్చిన అవకాశంతో ఈరోజున మంత్రివర్గంలో ఉన్న శ్రావణ్‌కుమార్ గారు వారి తండ్రి అడుగుజాడల్లో నడచి వారి పేరు, ప్రతిష్టలను నిలబెడతారని కోరుకుంటూ ఆ దిశగా వారికి, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ తెనాలి శ్రావణ్ కుమార్ (తాడికొండ)ః ధన్యవాదాలు అధ్యక్ష. చాలా దురదృష్టకరం. ఈరోజు దివంగత నేత సర్వేశ్వరరావు గారి మృతికి సంబంధించిన సంతాప తీర్మానం మీద మాట్లాడాల్సి రావడం చాలా దురదృష్టకరం. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ వారితో నాకున్న అనుబంధం దృష్ట్యా ఒక విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. వారు ఎం.ఎల్.ఏ. కాక ముందు ఎం.ఎల్.సీ.గా పని చేశారు. అప్పటి నుంచే నాకు వారితో పరిచయం ఉంది. సర్వేశ్వరరావు గారు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా ఉంటారు. ఎప్పుడు కలిసినా కూడా తాను ఏ ప్రాంతానికి, ఏ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారో వారి విషయాల పట్ల ఏనాడు కూడా మరచిపోకుండా ప్రతీసారి తన ప్రాంత సమస్యలు, ఆ ప్రాంత ప్రజల సమస్యలు వాటిని తీర్చడానికి కొన్ని సూచనలు కూడా చేసుకుంటూ పని చేశారు. అయితే ఆయన ఎంఎల్ఏగా ఎన్నికైన తరువాత ఆయనతో నాకు పరిచయం బాగా పెరిగింది. గౌరవ శాసనసభ్యులు వేణుగోపాల్ రెడ్డి గారు ఛైర్మన్‌గా ఉన్న అంచనాల సమితిలో సభ్యులుగా నేను,

సర్వేశ్వరరావు గారు కూడా ఉండటం మేమందరం కలసి దిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, కశ్మీర్ ప్రాంతాల్లో పర్యటన చేసిన సందర్భంలో వారికి, నాకు ఎంతో అనుబంధం ఏర్పడింది. ఆయన ఎప్పుడూ కూడా తన స్థాయిని, తను ఎక్కడి నుంచి వచ్చారో మరచిపోకుండా అనుక్షణం గుర్తు చేసుకునే మనిషి ఆయన. ఆయన వయసులో చాలా చిన్న వ్యక్తి. ఆయన ఈరోజున మన మధ్య లేరంటే చాలా బాధాకరం.

ఆయనను నక్సలైట్లు చంపివేయడం దురదృష్టకరమైన సంఘటనగా నేను భావిస్తున్నాను. వారు శాసనసభలో ఆఖరుగా మాట్లాడిన ప్రసంగం నాకు ఇంకా గుర్తు వస్తున్నది. ఎందుకంటే బెంత్‌ఒరియాలు అని కంచిలి, ఆముదాలవలస నియోజకవర్గంలో వారికి ఎస్టీ ధృవీకరణ పత్రాలను ఇవ్వడంలో ఇబ్బంది ఉందనే అంశాన్ని నేను స్వల్ప వ్యవధి ప్రశ్నగా శాసనసభలో లేవనెత్తడం, ఆ సందర్భంలో వారు మాట్లాడుతూ ఈవిధంగా కేవలం బెంత్‌ఒరియాలు మాత్రమే కాదు, మా నియోజకవర్గంలో అలాంటి వారు ఇంకా ఉన్నారు అని వారు మాట్లాడిన అంశాలను కూడా ఈ సభ దృష్టికి తీసుకుని వచ్చి నా నివాళిని పూర్తి చేస్తాను.

కిడారి సర్వేశ్వరరావు గారు చనిపోయారంటే మనం నమ్మలేని పరిస్థితి ఉంది. వారు ఇప్పటికీ మన చుట్టూనే తిరుగుతున్నట్లుగా ఉంది. భౌతికంగా ఇప్పుడు మన మధ్య లేరు గానీ వారు చేసిన చివరి ప్రసంగం మనమందరం ఒకసారి గుర్తు చేసుకుంటే బాగుంటుంది. నాకైతే గుర్తుంది. కిడారి సర్వేశ్వరరావు గారి ప్రసంగంలో గిరిజనుల సమస్యలపైనే తన గళం ఎప్పుడూ వినిపించేవారు. కొండకాపు, కొండ కుమ్మరి, ఏనేటి కొండలు సామాజిక వర్గాలకు న్యాయం చేయాలని కిడారి సర్వేశ్వరరావు గారు చేసిన ఆఖరు ప్రసంగాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. "మా నియోజకవర్గంలో కొండకాపు అనే తరగతి ఉంది. ఏనేటి కొండలు అనే వర్గం మా సరిహద్దు జిల్లా విజయనగరంలో ఉంది. వాళ్లు కూడా కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని బాధపడుతున్నారు. దాని వలన వాళ్ల బిడ్డల పరిస్థితి సర్వ నాశనం అవుతోంది. ఏదో ఒక ధృవీకరణ పత్రం వాళ్లకు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. లేకపోతే రాబోయే తరాలు, వాళ్ల భవిష్యత్తు కూడా సర్వ నాశనం అవుతుంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి కొండకాపు కులం ఏదైతే ఉందో, ఏనేటి కొండలు వర్గం ఎవరైతే ఉన్నారో వాళ్లకు కూడా ప్రభుత్వం కుల ధృవీకరణ పత్రాలివ్వాలి. వీళ్లకు బి.సి. ఇస్తారా, ఎస్టీ ఇస్తారా అనేది రాజ్యాంగ పరంగా సర్వే చేయించి వచ్చిన సర్వే నివేదిక ఆధారంగా వారికి ఒక కులం కేటాయించి ఆ సర్టిఫికేట్‌ని ఇచ్చేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. అలాగే కొండ కుమ్మరులు అనేవారు ఇంత వరకూ పైకి వచ్చిన పరిస్థితి లేదు. పూర్తిగా గిరిజన తెగకు చెందిన వారు.

12.30 PM

గిరిజనులతో పెళ్లిళ్లు చేసుకున్న వారు. వారిని బీసీలుగా గుర్తించడం వల్ల వెనుకబాటుకు గురవుతున్నారు. కొండ కుమ్మర, కొండ కాపు, ఏలేటి కొండలు, వీళ్లంతా స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు

అయినా ఇంకా వెనుకబాటుకు గురవుతూనే ఉన్నారు. ఈ అంశాలను ప్రభుత్వాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. వారికి న్యాయం చేయాల్సిందిగా గౌరవ సభాపతిగారి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నానని ఆ రోజు ఆయన బింతోఒరియాస్‌కి కుల దృవీకరణ పత్రాలను ఇవ్వడంలేదు, కంచిలీ మండలంతోబాటు వివిధ మండలాల్లో ఇవ్వడం లేదని నేను అడిగిన ప్రశ్నకు వారు కూడా ఇన్వాల్వ్ అయ్యి మాట్లాడటం జరిగింది". ఆ ఒక్క సందర్భంలోనే కాదు, ఆ ప్రక్కన కూర్చొని ఎంతసేపూ కొండ ప్రాంతాల్లో ఉన్న మా గిరిజనులు చాలా అసౌకర్యాలతో ఉన్న పరిస్థితులు ఉన్నాయి, మా సంగతి ఏమిటని ఈ అసెంబ్లీలో మైక్ పర్మిషన్ ఇస్తే, ఆ మైక్ సమయం దాటి మాట్లాడుతూ, తన యొక్క చిత్తశుద్ధిని తనను ఎన్నుకున్న ప్రజల కోసం, ముఖ్యంగా కొండ జాతి ప్రజల కోసం, ఆయన పడిన ఆరాటంగా తెలుస్తుంది. ఈ సందర్భంగా తమరి ద్వారా శాసనసభ దృష్టికి ఒక అంశాన్ని తీసుకురావాలి. కాశ్మీర్‌లో మా కమిటీ పర్యటన చేస్తున్న సందర్భంలో ఒకే కారులో మేము ప్రయాణం చేస్తున్నప్పుడు, అన్నా మా సొంత గ్రామానికి వెళ్లి కొన్ని సంవత్సరాలు అయ్యింది అన్నారు. ఏమిటి సర్వేశ్వరరావు ఎందుకు అలా అని మేము అడిగినప్పుడు, మేము వెళ్లే పరిస్థితి లేదు. మా గిరిజన ప్రాంతాల్లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రజాప్రతినిధుల మీద విపరీతమైన ఒత్తిడి ఉంది. ఆ ఒత్తిడిని తట్టుకొని నిలబడటమనేది చాలా కష్టంగా ఉందని ఆయన మాతో షేర్ చేసుకున్న అంశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

క్రింది వర్గాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధుల పట్ల నక్సలైట్లుగా ఉన్న వారి ఆలోచనల్లో కొంత మార్పు తీసుకొస్తే బాగుంటుందని అనుకుంటున్నాము. ఎందుకంటే ఎస్టీ రిజర్వ్‌డు సీట్లు, అక్కడ ఉన్న వనరులకు సంబంధించిన అంశంలో, స్థానికంగా ఉన్న గిరిజనులకు అవగాహన లేక, వాటి మీద వచ్చే ఆదాయ వ్యవహారాల మీద ఇతరులకు కన్ను ఉండి మధ్యలో సామాన్యమైన గిరిజనులు, అమాయకులైన గిరిజనులు బలవుతున్న సందర్భాన్ని కచ్చితంగా ఏదో ఒక రకమైన చర్యల ద్వారా వారి ప్రాణాలను, వారి ప్రాంతాలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. దాని కోసం ఏవైనా చర్యలను సభాపతిగా తమరు ఆయా ప్రాంతాల్లో పర్యటించడం గానీ, ఆయా ప్రాంతాల ప్రజలు మరియు గిరిజనుల యొక్క వ్యవహార శైలి మీద ఒక అవగాహనను, అటు ప్రభుత్వానికి ఇటు పోలీసు వారికి మధ్య ఒక వారధిగా తమరు ఏవైనా కొన్ని కార్యక్రమాలను రూపొందిస్తే తప్ప అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు, సర్పంచ్ దగ్గర నుంచి, ఎంపిటిసి దగ్గర నుంచి, ఎమ్మెల్యేల దగ్గర నుంచి, ఎవ్వరు కూడా ధైర్యంగా తిరగగలిగే పరిస్థితిని మనం కల్పించే దిశగా అవకాశం ఉంటే, ఈ అసెంబ్లీ పరంగా తమరు మార్గాన్ని అన్వేషించమని కోరుకుంటూ, సర్వేశ్వరరావు గారు మన మధ్య లేకపోవడం చాలా

దురదృష్టంగా భావిస్తున్నాను. ఇంకా ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుడు, వారి కుటుంబానికి ప్రత్యేకంగా నా సానుభూతిని తెలియజేసుకుంటూ వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలను తెలియజేసుకుంటూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీమతి గిడ్డి ఈశ్వరి (పాడేరు)ః అధ్యక్షా ఈరోజు స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు గారు, అలాగే స్వర్గీయ సివేరి సోమగారి యొక్క సంతాప తీర్మానం మీద మాట్లాడేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు గారిది ఒక నిరుపేద కుటుంబం, మారుమూల ప్రాంతం. నా పాడేరు నియోజకవర్గంలోనే కిల్లంకోట అని చాలా మారుమూల ప్రాంతం. ఇప్పటికీ అక్కడ ఒక రహదారి లేదు. వెళ్లాలంటే గుర్రాల మీద వెళ్లాల్సిన పరిస్థితి. అది పూర్తిగా మావోయిస్ట్ ప్రాభావిత ప్రాంతం. అంత మారుమూల ప్రాంతంలో పుట్టి కూడా, ఒక ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఉన్నత స్థాయికి ఎదిగిన తీరుని, అలాగే ఎన్నో కష్టాలుపడి వచ్చిన విషయాన్ని తమరి ద్వారా ఈ సభకు తెలియజేస్తున్నాను.

అంతేకాదు, కిడారి సర్వేశ్వరరావుగారి భార్య స్వయాన నాకు పిన్ని కూతురు. ఆ విధంగా ఆయన మాకు బంధువు కూడా అవుతాడు. నిజంగా ఈ సభలో వారి గురించి మాట్లాడతానని ఎప్పుడూ మేము అనుకోలేదు. గత అసెంబ్లీ సమావేశాల్లో, ఆ ముందు రోజు సెప్టెంబర్ 18వ తారీకున నేను అడిగాను. ఏం బాబు ఈసారి అసలు వాయిస్ ఇవ్వడం లేదు, ఏమి మాట్లాడటం లేదు, అంటే నేను next గెలిచి వచ్చి మాట్లాడతాను ఒదినా, ఇప్పుడు మాట్లాడను అని ఆయన చెప్పిన చివరి మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. ఎందుకంటే, ఏదైతే ప్రభుత్వ విప్‌గా మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తనకు భాద్యతలను అప్పగించారో, దాంతో అందరితో సన్నిహిత సంబంధాలను పెట్టుకొని, ఎవరు ఏ విధంగా ప్రశ్నిస్తూ మాట్లాడతారు, ఇవన్నీ కూడా ఒక్కొక్కరి దగ్గరకొచ్చి అందరితో చక్కగా మాట్లాడిన నేపథ్యంలో ఆ విధంగా సభ్యులందరితో వారికి అనుబంధం ఏర్పడింది. అలాంటి మంచి వ్యక్తి ఈరోజు మన మధ్య లేరు. నిజంగా వారికి జరిగిన సంఘటన దురదృష్టంగా నేను భావిస్తున్నాను.

అలాగే, సివేరి సోమ గారు కూడా మాజీ ఎమ్మెల్యేగా ఉన్నారు. వారు కూడా ఒక నిరుపేద కుటుంబం నుంచి వచ్చారు. చాలా కష్టాలు పడి, మేమందరం కూడా గిరిజనులమై ఉండి, మాకున్న అవకాశాలను, మాకున్న పరిస్థితుల నుంచి ఈ స్థాయికి వచ్చామంటే, అది నిజంగా ఆ భగవంతుడు మాకు కల్పించిన అదృష్టంగా భావిస్తున్నాము. కానీ అర్థాంతరంగా, అకారణంగా ఏదైతే ఆ రోజు సెప్టెంబర్

23న సంఘటన జరిగిందో, ఆరోజు పదకొండున్నర 12 గంటల సమయంలో ఆ వార్త విన్న వెంటనే నేనైతే షాక్‌కి గురయ్యాను. వెంటనే పోలీసు వారు.. నేను కూడా శాసన సభ్యురాలుగా ఉన్నాను గనుక, మీరు ఆ ప్రాంతంలో ఉండొద్దని పోలీసు వారు ఎంత హెచ్చరించినా, నా సహచర శాసన సభ్యులు, అందులో నా బంధువు మరణం అక్కడ జరిగినప్పుడు, నేను వెళ్లకపోతే ఎలా ఉంటుందని, అన్నింటికీ తెగించి, ఆ రోజు అరకు వెళ్లడం జరిగింది. నిజంగా వారి కుమారుడు శ్రావణ్ గానీ, ఇంకొక బాబు సందీప్ గానీ, మా చెల్లెలు పరమేశ్వరి గానీ, పాప కనిష్కా గానీ, ఆ కుటుంబ సభ్యులు పడుతున్న వేదన, అంతేకాకుండా సివేరి సోమ గారి కుటుంబం పడుతున్న వేదనను చూసి గుండె తరించిపోయింది. వారితోబాటు మా గిరిజనులంతా ఆందోళనతో మొత్తం నిశ్శబ్ద యుద్ధంలా ఆరోజు ఉన్న పరిస్థితిని ఇప్పటికీ మేమెవ్వరం మరిచిపోలేకపోతున్నాము.

నిజంగా అలాంటి సమయంలో, విదేశాల్లో ఉండి కూడా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఫోన్లు మీద ఫోన్లు చేసి పోలీసు వారు, కలెక్టర్ గారు, హోమ్ మినిష్టర్ గారు, ఆరోజు గిరిజన సంక్షేమ శాఖామాత్యులుగా ఉన్న ఆనందబాబు గారు, అందరు కూడా ఆరోజు మాకు ఎంతో ధైర్యం చెప్పి, మీరు డీలా పడిపోకండి, మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది, మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, మన లోకేష్ గారు అండగా ఉంటారని వారు చెప్పిన మాటలు, మాటలేకాదు, వారు అందించిన చేయూత గానీ, వారి కుమారుడు శ్రీ కిడారి శ్రావణ్ కుమార్ గారికి మంత్రి పదవిని ఇవ్వడం, అంతేకాకుండా వారి రెండో అబ్బాయి సందీప్‌కి డెప్యూటీ కలెక్టర్‌గా గ్రూప్-1 ఉద్యోగానివ్వడం, అంతేకాకుండా సివేరి సోమ గారి కుటుంబానికి కూడా ఆర్థికంగా సహాయం చేసి అన్ని విధాలుగా వారిని ఆదుకోవడం, నిజంగా ఈరోజు కొంచెం మాకు ఫర్వాలేదు, ఇంత నష్టం జరిగినందుకు కుటుంబానికే కాదు, మా గిరిజనుల అభివృద్ధి సంక్షేమం విషయంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మాకు అండగా ఉన్నారని, ఇప్పుడిప్పుడే మేము కొంచెం కోలుకుంటున్నాము. ఇది గతంలో కూడా గౌరవ మంత్రివర్యులుగా ఉన్న మణికుమారిగారి భర్త వెంకటరాజు గారికి అటువంటి పరిస్థితి వచ్చినప్పుడు కూడా మా గిరిజన ప్రాంతాల్లో ఇదొక సున్నితమైన అంశంగా, అక్కడ పని చేస్తున్న ప్రజాప్రతినిధులుగా మేము ఎంత ఫ్లగుల్ పడుతున్నామో, ఈ చర్యను బట్టి అర్థం చేసుకోవాల్సిందిగా తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

ఏదైతే ప్రజల ద్వారా, ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వంగా ప్రజాస్వామ్యంలో ప్రజలకు, వారికి అందాల్సిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మన తెలుగుదేశం ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, ఇప్పటికే కొన్ని కోట్ల రూపాయలను మా గిరిజనుల అభివృద్ధి,

సంక్షేమం కోసం వెచ్చించారు. మేము ఇంకా ముందుకెళ్లి, ధైర్యంగా మా ప్రజలకు సేవ చేయడానికి మాకొక బరోసాను, భద్రతను ఇచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖచ్చితంగా, ఇంకా మేము కష్టపడి మా ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటాం.

12.40 PM

నిజంగా ఇలాంటి సందర్భంలో వారి గురించి మాట్లాడవల్సి వస్తుందనేది నేను ఏ రోజూ అనుకోలేదు. నాకు ఇప్పటికీ గుర్తు ఉంది. 2018, సెప్టెంబర్ 19వ తారీఖున టి.డి.ఎల్.పి. మీటింగ్ అయినప్పుడు కూడా ఆ రోజున ''గ్రామ దర్శిని - గ్రామ వికాసం'' కార్యక్రమమనేది మా రెండు నియోజకవర్గాల్లో సరిగ్గా జరగడంలేదనే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు నాతో చెప్పినప్పుడు నేను చెప్పాను. మాకు చాలా కష్టంగా ఉంది సార్, గిరిజన ప్రాంతాల్లోని చివరి గ్రామాలకు వెళ్లాలంటే కనుక పోలీస్ వాళ్లు మమ్మల్ని పంపించడం లేదు, పర్మిషన్ ఇవ్వడం లేదు, దయచేసి గ్రామాల్లోకి వెళ్లేందుకు గానూ మాకు పోలీసులతో పర్మిషన్లు ఇప్పించి, మేం గ్రామాల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా అవకాశం కల్పించమని గౌరవ ముఖ్యమంత్రి గారితో అన్నప్పుడు కచ్చితంగా మీకు అవకాశాలు కల్పిస్తామని వారు అన్నారు. ఇప్పుడు ''జన్మభూమి - మా ఊరు'' వంటి కార్యక్రమాలకు మేం గ్రామాలకు వెళ్తున్నప్పుడు గానీ, ఎటువంటి కార్యక్రమాలకు గానీ మేం గ్రామాలకు వెళ్తున్నా సరే కచ్చితంగా మాకు పోలీస్ రక్షణను బాగా కల్పించారు. మాకు భద్రతను కూడా బాగా పెంచారు. ప్రభుత్వం కల్పించిన ఈ భద్రతను మేం బాగా వినియోగించుకుని ఇప్పుడు మేం గ్రామాల్లోకి పూర్తిగా వెళ్తున్నాం. మా గిరిజనుల్లో ఉన్నటువంటి ఆందోళనల్ని, భయాల్ని కూడా ఇప్పుడు మేం పూర్తిగా తొలగింపచేస్తున్నాం. కచ్చితంగా రాబోయే కాలంలో ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధిని, సంక్షేమాన్ని మేం ముందుకు తీసుకువెళ్లడమే గాకుండా తద్వారా మా గిరిజనులమంతా అభివృద్ధి చెందుతాం. నిజంగా అరకు ప్రాంత అభివృద్ధికి గాను మా సర్వేశ్వరరావు గారు మరియు సివేరి సోమ గారు చేసినటువంటి కృషికి అనుగుణంగానే మేం కూడా వారి యొక్క స్ఫూర్తిని, వారి యొక్క ఆదర్శాలను, వారి యొక్క ఆశయాలను నిలబెట్టుకునే విధంగా ప్రతి ఒక్కరం కూడా మా ప్రాంతాలను అభివృద్ధి చేసుకునే విధంగా ఈ రోజున సర్వేశ్వరరావు గారి పెద్ద కుమారుడైన శ్రీ కిడారి శ్రావణ్ కుమార్ గారికిచ్చిన మంత్రి పదవితో మేమంతా ఇంకా అభివృద్ధి చెందుతామని ఈ సందర్భంగా తెలియజేస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ శ్రీ కిడారి శ్రావణ్ కుమార్ గారు.

శ్రీ కిడారి శ్రవణ్ కుమార్ (గిరిజన సంక్షేమ శాఖా మంత్రి): నమస్కారం అధ్యక్షా, ఈరోజు మొదటిసారిగా అసెంబ్లీలో నా మొదటి మాటలు మా తండ్రి గారి మరణానికి గాను సంతాపం తెలియజేయడమనేది నాకు చాలా బాధాకరంగా ఉంది. నా జీవితమనేది మన పొలిటికల్ సిస్టానికి గానీ, ఇక్కడున్న బ్యూరోక్రటిక్ సిస్టానికి గానీ దూరంగా మా తండ్రి గారు మా చదువుల నిమిత్తం మమ్మల్ని వేరే

ప్రదేశంలో పెట్టి అక్కడే ఉంచి చదివించిన పరిస్థితి ఉంది. అలాంటి సందర్భంలో ఈరోజున sudden గా మా తండ్రి గారు చనిపోయారు అనే ఒక మాట వినగానే నేను ఒక ఆందోళనకు గురైనాను. నేను ధైర్యాన్ని కోల్పోయాను. ఒక మనిషి మరో మనిషిని చంపుకునే పరిస్థితి, అలాంటి సొసైటీలో నేను బతుకుతున్నాననే ఒక భయం నాలో కల్గింది. ఆ భయం నన్ను వెంటాడుతోంది. మా తండ్రి గారు చనిపోయిన రోజున కూడా నేను చాలా సార్లు మా నాన్న గారి ఫోన్‌కు మాట్లాడే నిమిత్తం ప్రయత్నం చేశాను. కానీ, ఆరోజున వీలు పడలేదు. ఫోన్ కాల్ కలువలేదు. వీలు పడనప్పటికి కూడా రెండు, మూడు గంటల తరువాత మళ్లీ వారి నుంచి నాకు రెస్పాన్స్ వచ్చింది. అప్పటికే నాన్న గారు, సోమ గారు గానీ మావోయిస్టుల కాల్పుల్లో మృతి చెందడం జరిగింది. వారి మృతదేహాలేవైతే మా నాన్న గారిది గానీ, సోమ గారిది గానీ కాల్పులు జరిగిన ప్రాంతం నుంచి తీసుకురాలేనటువంటి పరిస్థితి ఆరోజున ఉంది. ముందుగా ఈ మాటలు ఎందుకు చెప్పానంటే, మా కుటుంబంతో గానీ, కుటుంబ సభ్యులతో గానీ మాకంటే ఎక్కువగా మా తండ్రి గారు ఎక్కువగా ప్రజలతో కలిసి ఉంటాడనే విషయం ఇక్కడుండే మీకందరికి కూడా తెలిసిన విషయమే. ఎవరైనా సరే మా తండ్రి గారి జ్ఞాపకాలు గానీ, వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నప్పుడు గానీ శ్రీ కిడారి సర్వేశ్వరరావు అనగానే ఆ ముఖంలో ఉన్న చిరునవ్వు ఏమిటనేది అందరికీ తెలుసు. ఆ చిరునవ్వు ఒకటే అందరికీ కనబడుతూ ఉంటుంది. అలాంటి చిరునవ్వుతో ఉండే మనిషి , అంత మంచి మనిషి నీతి, నిజాయితీగా ఎక్కడ కూడా స్వార్థం లేకుండా గిరిజనుల సంక్షేమం కోసం పనిచేసిన మనిషిని ఆరోజున కేవలం కొన్ని దుష్టశక్తులు వాళ్ల వాళ్ల ఆలోచనా విధానంతో ఏవిధంగా కూడా ముందుకు వెళ్లలేనటువంటి పరిస్థితుల్లో మా నాన్న గారిని గానీ, సోమ గారిని గానీ మావోయిస్టులు చంపడమనేది జరిగింది. అలాంటి ఒక భయంకరమైన పరిస్థితుల్లో నేను గానీ, నా కుటుంబం గానీ ఉన్నటువంటి పరిస్థితుల్లో ఎవరైనా సరే ఎంత మంది ఎన్ని మాటలు చెప్పినా సరే నాకు ఎటువంటి ధైర్యం రాలేదు. ఆరోజున ఉన్న పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా మన దేశంలో లేకపోవడం జరిగింది. అయినప్పటికి కూడా విదేశీ పర్యటనలో ఉన్నప్పటికి కూడా ఎప్పటికప్పుడు మాకు ఫోన్‌లోనే ధైర్యం చెప్పే కార్యక్రమం వారు చేశారు. కానీ, అప్పటికి కూడా నేను చాలా అధైర్యంగానే ఉన్నాను. నేను దిల్లీలో ఉన్నప్పుడు నాకు ఏదైతే మా తండ్రి గారి మరణ వార్తకు సంబంధించిన ఫోన్ కాల్ అందింది. కానీ, ఆ రోజున కూడా నా కంట్లో నుంచి నీటి చుక్క రాలేదు. షాక్‌లోనే ఉన్నాను. సి.ఎం. గారు అమెరికా దేశ పర్యటనను ముగించుకుని మన దేశానికి రాగానే నేరుగా మా ఇంటికి వచ్చారు. వారు మా ఇంటికి వచ్చి వెళ్లిన పది నిమిషాల తరువాత నాకు ఏడ్పు వచ్చింది. ఆరోజున నేను ఏడ్చాను. ఒక షాక్ నుంచి బయటకు వచ్చాను. సార్ మా ఇంటికి వచ్చి మాకు ఒక ధైర్యాన్ని ఇచ్చారు. వారిచ్చిన ఆ ధైర్యంతో నేను ఆరోజున ఏడ్చాను. అంత వరకు నా కంట్లో నుంచి ఒక చుక్క నీరు కూడా రాలేదు. ఈరోజున ఇక్కడకు నేను వచ్చిన తరువాత అందరు కూడా మా తండ్రి గారి గురించి చెబుతుంటే నాకు తెలిసింది. ఈ పొలిటికల్ సిస్టమ్‌లో నేను లేనప్పటికి కూడా, నాన్న గారు ఎంత కష్టపడ్డారనే విషయం గౌరవ సభ్యులు చెబుతోన్న మాటల వల్ల నాకు తెలియడమే కాకుండా స్పష్టంగా అర్థం అవుతోంది. వారు గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం ఎంత సేవ, తోడ్పాటు అందించారనే

విషయం తెలుస్తోంది. ఎప్పుడు నేను చూసినా సరే, మా తండ్రి గారు చేతిలో ఫైల్స్ పట్టుకుని తిరుగుతూ ఉండేవారు. ప్రతి ఒక్కరినీ నవ్వుతూ పలకరించేవారు. గిరిజన ప్రాంత సమస్యలు తప్ప ఇంకేమి మా తండ్రి గారు ఆలోచించేవారు కాదు. గౌరవ ముఖ్యమంత్రి గారిని నేను, మా కుటుంబ సభ్యులం కలిసినప్పుడు కూడా ఒకటే వారు చెప్పారు. మీ నాన్న గారు నన్ను పదవి కూడా కోరలేదమ్మా అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. గౌరవ మంత్రి గారైన శ్రీ నారా లోకేశ్ గారైతే ఒక విషయం చెప్పారు. గిరిజన ప్రాంత అభివృద్ధికి ముఖ్యంగా మా అరకు నియోజకవర్గ అభివృద్ధికి గాను నిధులు తప్ప మరేమి మీ నాన్న గారు అడగలేదనే విషయాన్ని వారు మాతో చెప్పడం జరిగింది. అంతటి ఉన్నతమైన ఆశయాలు మా తండ్రి గారికి ఉండి, ఎప్పుడైనా సరే గిరిజన ప్రాంత అభివృద్ధికోసమే కష్టపడి, పాటుపడే వ్యక్తి అయిన మా తండ్రి గారిని ఇలా మావోయిస్టులు ప్లాన్ చేసి, స్కెచ్ వేసి కాల్చి చంపడమనేది చాలా దురదృష్టకరం. ఒక తండ్రిని కోల్పోయిన బాధ కంటే, ఒక మంచి వ్యక్తి, తెలివైన వ్యక్తి, గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే వ్యక్తిని కోల్పోవడమనేది నేను కూడా ఒక గిరిజనుడిగా బాధ పడుతున్నాను. అలాంటి వ్యక్తి మరణం వల్ల మా గిరిజన ప్రాంత అభివృద్ధి అనేది ఇరవై, ముప్ఫై సంవత్సరాల వెనక్కి వెళ్లిపోతుందనే భయంతో బాధ పడుతున్నాను. అలాంటి సందర్భంలో కూడా గౌరవ ముఖ్యమంత్రి గారు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గానీ, మరీ ముఖ్యంగా గిరిజన ప్రాంతాలకు ఎటువంటి ఇబ్బంది కల్గకూడదనే భావనతో, మా కుటుంబానికి గానీ, అదే విధంగా మా తండ్రి గారితో పాటు మావోయిస్టుల చేతిలో మరణించిన అరకు మాజీ శాసనసభ్యులైన శ్రీ శివేరి సోమన్న గారి కుటుంబానికి గానీ గౌరవ ముఖ్యమంత్రి గారు అన్ని విషయాల్లో అండగా నిలిచారు. అందులో భాగంగానే రాజకీయంగా నాకు మంత్రి పదవి ఇవ్వడం గానీ, మా తమ్ముడైన కిడారి సందీప్ కుమార్‌కు గ్రూప్-1 ఉద్యోగ నియామకం కల్పించడంతోపాటు మా ఇరు కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆర్థికంగా గౌరవ ముఖ్యమంత్రి గారు ఆదుకోవడం జరిగింది. మన సి. ఎమ్. గారు మా తండ్రి గారి మరణానంతరం పరామర్శకు మా ఇంటికి వచ్చిన సందర్భంగా కూడా మాకు సొంతంగా ఇల్లు కూడా లేనటువంటి పరిస్థితి ఉండేది. 2007 నుంచి 2009వ సంవత్సరం వరకు మా తండ్రి గారు ఎమ్మెల్సీగా పనిచేశారు. 2014వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో మా తండ్రి గారు అరకు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి మంచి మెజార్టీతో అంటే 34,600 ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది. ఎమ్మెల్యేగా మా తండ్రి గారు నాలుగు సంవత్సరాల పాటు పనిచేసినప్పటికి కూడా మాకు ఒక సొంత ఇల్లు కూడా లేనటువంటి పరిస్థితి మాది. ఆ విషయాన్ని గమనించి గౌరవ ముఖ్యమంత్రి గారు మా కుటుంబాన్ని ఈరోజున ఆర్థికంగా గానీ, అదే విధంగా హౌస్ సైట్స్ గానీ ఇవ్వడం జరిగింది. ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు కుటుంబాల్ని ఏదో ఒక విధంగా ఇంకా చెప్పాలంటే అన్ని విధాలుగా కాపాడుతూ, మిమ్మల్నందరినీ నా కుటుంబ సభ్యులుగా చూసుకుంటాననే ఒక మాట మా కుటుంబానికి గౌరవ ముఖ్యమంత్రి గారు ఇవ్వడం జరిగింది. నా ప్రమాణ స్వీకారానికి ముందు రోజు మా కుటుంబ సభ్యులతో పాటు నేను గౌరవ సి.ఎమ్. గారిని కలిసినప్పుడు వారితో నేను ఒకటే మాట చెప్పడం జరిగింది. ఏమిటంటే, ఇవన్నీ మా కుటుంబానికి

వారు చేసినందుకు గాను నేను ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు చెప్పాను. ఆ సందర్భంలో వారు మాతో మమేకమై మిమ్మల్ని నేను మా కుటుంబ సభ్యులుగా భావిస్తున్నాను. నాకు కృతజ్ఞతలు మీరు చెప్పాల్సిన అవసరం లేదని వారు నాతో అనడం జరిగింది. ఏమిటంటే, మీ నాన్న గారికి ఉన్న ఒక గొప్ప మనస్సు, ఆయన గారికి ఉండే కష్టపడేతత్వం, వారు గిరిజన ప్రాంత ప్రజలకు చేసిన సేవ తదితరవాటిని గుర్తించడంతో పాటు మిమ్మల్ని కూడా సమాజంలో పైకి తీసుకురావడం జరుగుతుందనే హామీని గౌరవ ముఖ్యమంత్రి గారు మా కుటుంబానికి ఇవ్వడమనేది జరిగింది. ఈరోజున నేను మావోయిస్టులను ఒకటే క్వశ్చన్ అడుగుతున్నాను. గిరిజనుడిగా పుట్టి, గిరిజనుల్లో పెరిగి, వారితో మమేకమై, గిరిజన ప్రాంత అభివృద్ధి కోసం వాళ్ల మధ్యనే పెరుగుతూ, వాళ్లు తినే తిండే తింటూ, వాళ్ల ఆచారాలు, సాంప్రదాయాలనే గౌరవించి, ముందుకు సాగిస్తూ, వాళ్ల సంక్షేమం కోసం కష్టపడుతూ, జీవితాంతం వాళ్ల మధ్యనే ఉంటూ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నటువంటి గిరిజన నాయకులను మావోయిస్టులు టార్గెట్ చేసి కాల్చి చంపడమనేది ఎంత వరకు కరెక్టు అని నేను వారిని అడుగుతున్నాను. రెండు బుల్లెట్లు కాల్చినప్పుడు రెండు ప్రాణాలు కోల్పోయాయని మావోయిస్టులు అనుకుంటున్నారు కానీ తద్వారా ఒక ప్రాంతం ఇరవై, ముప్పై సంవత్సరాల అభివృద్ధి వెనక్కు వెళ్లిపోతుందనే విషయాన్ని వాళ్లు గుర్తించలేదు. వాళ్ల ఘాతుకానికి ఇద్దరు మహిళలు, భర్తలను కోల్పోతారనే ఆలోచన వారికి లేదు. పిల్లలు కూడా తండ్రిలేని పిల్లలుగా బతకాల్సి వస్తుంది. సోమ అన్న గారికి ఒక సంవత్సరం వయసు కల్గిన అబ్బాయి ఉన్నాడు. కానీ, ఆ పిల్లవాడు ఎన్ని సంవత్సరాలు బతికితే అన్ని సంవత్సరాలు తండ్రి లేని పిల్లవాడిలా బతకాల్సిన ఒక దుస్థితి వస్తుంది. మరి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం, గిరిజన ప్రజల బతుకుల కోసం పాటుపడుతున్నామనే మాటలు చెబుతోన్న మావోయిస్టులు గిరిజన కుటుంబాల మీద ఎందుకు మక్కువ చూపడం లేదనే భావన నాలో ఉంది. ఇదొక్కటే కాదు. ఇట్లాంటి సందర్భాలు చాలానే జరిగాయి. మావోయిస్టులు చేస్తోన్న దుశ్చర్యల వల్ల కొన్ని వేల కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. మన మాజీ మంత్రి గారైన శ్రీమతి మణికుమారి గారి భర్తను కూడా మావోయిస్టులు నడిరోడ్డు మీద కాల్చి చంపడం కూడా గతంలో జరిగింది. చెప్పాలంటే ఇట్లాంటి సంఘటనలు చాలానే ఉన్నాయి. అట్లాంటివి కూడా గిరిజన కుటుంబాలే కదా! ఏ విధంగా అట్లాంటి కుటుంబాలు నిలదొక్కుకుంటాయి, ఏ విధంగా ఆ కుటుంబాలు పైకి వస్తాయి, ఏ విధంగా ఆ కుటుంబాలు బతుకుతాయనే ఆలోచన కూడా మావోయిస్టులకు లేదు. ఇలాంటి సందర్భంలో కూడా మావోయిస్టులు చెప్పుకుంటున్న సాకులు కూడా బాక్సైట్ త్రవ్వకాలని గానీ, మరో కారణం గానీ వాళ్లు చెబుతున్నారు. కానీ, 2015వ సంవత్సరంలో వచ్చిన దసరా పండుగ రోజున కూడా మా తండ్రి గారు అరకు పరిధిలోని గోపురాల కొండ అని పిలుచుకునే ఒక నక్సలైట్ ప్రాంతానికి వెళ్లి పెద్ద మీటింగ్ పెట్టి బాక్సైట్ త్రవ్వకాల మీద నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఏమిటంటే, ఆ ప్రాంతంలో బాక్సైట్ త్రవ్వకం నిమిత్తం భూమిలో ఒక గునపం దిగినా సరే నేను నా రాజకీయ జీవితానికి సన్యాసం తీసుకుని నేను కూడా మన గిరిజన ప్రజలతో పాటు పోరాటం చేస్తాననే విషయాన్ని మా తండ్రి గారు ఆనాడు చెప్పడం కూడా జరిగింది. ఆరోజున పండుగైనా సరే మా తండ్రి గారు కుటుంబ సభ్యులతో ఉండకుండా

అక్కడకు వెళ్లి గిరిజనులతో మమేకమై కేవలం ఈ బాక్సైట్ త్రవ్వకాల మీద మా తండ్రి గారు పోరాటం చేయడమనేది ఆనాటి నుంచే జరుగుతోంది. గౌరవ ముఖ్యమంత్రి గారు కొన్ని వేల సార్లు చెప్పారు. మా నాన్న గారు కూడా కొన్ని లక్షల సార్లు చెప్పారు. బాక్సైట్ త్రవ్వకమనేది ఎటువంటి పరిస్థితుల్లో కూడా చేయకూడదు. మా ప్రభుత్వం అందుకు వ్యతిరేకమని ఎప్పుడూ చెబుతున్నప్పటికి కూడా మావోయిస్టులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటమనేది ఎంత వరకు కరెక్టు అని అడుగుతున్నాను. అది కూడా ఈరోజున మావోయిస్టులు అందుకు గాను సరైన సమాధానం చెప్పుకోలేనటువంటి పరిస్థితిలో ఉన్నారు.

12.50

ఇలాంటి పరిస్థితుల్లో కూడా వాళ్లు అర్థం చేసుకోవాలి. మేము గాని, ఇతర శాసనసభ్యులు గాని గిరిజనులకు వ్యతిరేకంగా పనిచేసినప్పుడు ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి మాకు సమాచారం ఇస్తే ఏమైనా ఉంటే మార్చుకోడానికి అవకాశం ఉంది. కానీ మాఅంతట మేము మంచి పనులు చేస్తున్నప్పటికీ, గిరిజనులతోపాటే ఉంటున్నప్పటికీ, వాళ్ల కష్టాల కోసం పనిచేసినప్పటికీ ఈరోజు మా కుటుంబాలన్నీ రోడ్డుమీద పడిన పరిస్థితి ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ఇదే చెప్పడం జరిగింది, అంత మంచి మనిషిని ఇలా చేయడం చాలా దారుణమని అనడం జరిగింది.

ఇలాంటి కష్టకాలంలో నన్నూ, నా కుటుంబాన్ని, ముఖ్యంగా మా గిరిజన ప్రాంతాలన్నింటినీ ఆదుకోడానికి నాకిచ్చిన మంత్రి పదవిని గాని, మా తమ్ముడికి ఇచ్చిన ఉద్యోగం గాని, అబ్రహం గారికి ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ కమీషన్ మెంబరు గాని, వీటన్నింటికీ నా తరఫున, నా కుటుంబం తరఫున, అదే విధంగా సోమన్న గారి కుటుంబం తరఫున కూడా ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఇది ఈరోజు కేవలం కిడారి కుటుంబానికి చెందినదే కాదు అధ్యక్షా, మొత్తం గిరిజన జాతికి ఇచ్చిన ఒక భరోసా అధ్యక్షా. గిరిజన జాతి ముందుకు రావాలి, అభివృద్ధి చెందాలని తీసుకున్న ఒక నిర్ణయం ఇది అధ్యక్షా. అదేవిధంగా మేము కష్ట కాలంలో ఉన్నప్పుడు అన్ని విధాలుగా మమ్మల్ని ఆదరించి సొంత కుటుంబంలా చూసుకుంటున్న ఇక్కడున్న మన గౌరవ మంత్రి వర్యులు కానీ, గౌరవ శాసనసభ్యులు కాని అందరకూ నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఎక్కడా కూడా ఎటువంటి పక్షపాతం లేకుండా చిన్న పిల్లవాడినే అయినప్పటికీ తండ్రి కోల్పోయిన బాధను వాళ్లు కూడా అర్థం చేసుకుని అన్ని విధాలుగా, వారి కుటుంబ సభ్యులలో ఒక సభ్యునిగా చేర్చుకుని ముందుకు వెళుతున్న పరిస్థితి ఉంది. దీనికి అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఈరోజు ఒకటే తెలియజేసుకుంటున్నాను. ఏదైతే ముఖ్యమంత్రి గారు నామీద పెట్టిన బాధ్యత ఇదొక పదవి లాగా

కాకుండా ఒక బాధ్యతగా భావిస్తున్నాను. మానాన్న గారి ఆశయాలను నెరవేరుస్తూ మా రెండు కుటుంబాలు కూడా ఎప్పుడూ గిరిజనుల అభివృద్ధికి, మా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, గిరిజనుల వెంటనే ఉంటామని తెలియజేసుకుంటున్నాను. ఇలాంటి దుశ్చర్య వచ్చినప్పుడు గౌరవ శాసనసభ్యులు చెప్పినట్లుగా అన్ని సంఘాల వారు మనకు Think Tanks. Society లో ఉండే వారందరూ కూడా ఇటువంటి విషయాలను ఖండించాల్సి ఉంటుంది. ఎక్కడా ఒక్క మచ్చ కూడా లేని నాయకుడిని గిరిజన ప్రాంతాల నుండి పైకి వస్తున్న నాయకులందరనూ ఇలా మట్టుపెట్టుకుంటూ పోతే సరైన నాయకత్వం లేని కారణంగా ఆ ప్రాంత అభివృద్ధి వెనుకకు వెళ్లిపోతుంది. కొన్ని వేల కోట్లతో అభివృద్ధి చేశాం. నాన్న గారు వచ్చిన తరువాత ఏదో విధంగా అభివృద్ధి చెందాలి, అప్పుడున్న పరిస్థితుల్లో మన ప్రభుత్వం (తెలుగుదేశం ప్రభుత్వం) చేస్తున్న కార్యక్రమాలు చూసి మన ప్రభుత్వంలో చేరడం జరిగింది. చేరిన తరువాత గత 70సంవత్సరాల నుండి, స్వాతంత్ర్యం రాకముందు నుండి ఉన్న సమస్యలన్నింటినీ కూడా మనం ఇప్పుడు నాన్న గారి హయాంలో చాలా వరకు అడ్రస్ చేయడం జరిగింది. జరకొండ అనే ప్రాంతానికి కనీసం టూ వీలర్ కూడా వెళ్లలేని పరిస్థితుల్లో అయిదు గంటలు కాలి నడకన వెళ్లి అక్కడ చూసి వచ్చి నాన్నగారు చనిపోయే ముందు ఆ ప్రాంతానికి రోడ్డు శాంక్షన్ చేయించారు. ఆరోడ్డు ఇప్పుడు పూర్తి అయ్యే పరిస్థితికి వచ్చింది. అక్కడున్న ప్రజలందరు వచ్చి ఒకటే మాట చెప్పారు. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ నాయకుడు కూడా అక్కడకు రాలేదు అని చెప్పడం జరిగింది. అది చాలా ఆనందం కలిగించింది అధ్యక్షా, ఇంత మంచి పనులు చేస్తున్నప్పటికీ కూడా ఇలాంటి నాయకులను కోల్పోయి కుటుంబాలన్నీ రోడ్డు మీద పడిన పరిస్థితి, చాలా ఇబ్బందికరంగా ఉంటుంది అధ్యక్షా. మరొకసారి తెలియజేసుకునేది ఏమనగా నా కుటుంబానికి అన్ని విధాలుగా కూడా ప్రోత్సాహం ఇచ్చి అండగా ఉండి ఏ విధంగా అయితే నన్ను వారి కుటుంబాల్లో ఏకం చేసుకుని చూసుకుంటున్న సహచర మంత్రి సభ్యులకు, శాసనసభ్యుల అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : గౌరవ ముఖ్యమంత్రి వర్యులు, వారితోపాటు చాలామంది గౌరవ శాసనసభ్యులు ఈ కీర్తి శేషులైనటువంటి కిడారి సర్వేశ్వరరావు గారి మరణం పట్ల సంతాపం తెలుపుతూ వారి గురించి వారితో మీకు ఉన్నటువంటి అనుబంధాన్ని గురించి మాట్లాడారు. నాకు వారితోటి నాలుగున్నర సంవత్సరాల పరిచయం. ఒక శాసనసభ్యునిగా వారిని చూశాను. ప్రభుత్వ విప్‌గా వారిని చూశాను. గిరిజనుల గురించి, గిరిజన ప్రాంతాల గురించి శాసనసభ్యులుగా వారు స్పష్టమైన అవగాహనతో మాట్లాడటం గమనించాను. అట్లాగే ప్రభుత్వ విప్‌గా వారు చీఫ్ విప్ గారి ఆదేశాలు, సూచనల మేరకు

గాని అజెండాలో ఉన్న అంశాలపై ఎవరెవరు మాట్లాడతారో అని సభ్యులందరి దగ్గరకు వెళ్లి సమాచార చిట్టా తీసుకుని నా దగ్గరకు వచ్చి చెప్పి వారందరిచేత మాట్లాడించడం వంటి సందర్భాన్ని చూశాను. ఈ గిరిజన యువకునికి భవిష్యత్తు మంచిగా ఉంటుంది అని చెప్పి అప్పుడు అనుకున్నాను. అలాంటి సందర్భంలో ఇలాంటి దుర్ఘటన జరగడం కిరాతకం, చాలా బాధాకరం, శోచనీయం. వాళ్లు చెబుతుంటారు మేమంతా బడా బాబులకు వ్యతిరేకం, బూర్జువలకు వ్యతిరేకులం, పెత్తందారులకు వ్యతిరేకం అనుకునే వాళ్లు మావోయిస్టులు. ఒక గిరిజనుడును, గిరిజనుల కోసం పనిచేసే వారిని, గిరిజన ప్రాంతాలకు సేవ చేసే వాడిని ఎలా చంపారో వారే చెప్పాలి. ఎందుకంటే ఒక సంచలనం కోసం చేశారని లేదా వాళ్ల ఉనికిని బయటపెట్టుకోవడం కోసం చేశారని చెబుతున్నారు. అంటే అలాంటి ఉనికి కోసమో, సంచలనం కోసమో ఎదుగుతున్న గిరిజన నాయకుడు, గిరిజన ప్రతినిధిని చంపడం అనేది చాలా దుర్మార్గం. అలాంటివి వారు వల్లవేసే సిద్ధాంతాలు, ఆదర్శాలన్నీ కూడా భూటకమని ప్రజలందరూ అర్థం చేసుకుంటారన్నమాట. ఇలాంటి వాటివల్ల ఒక పతనం తప్ప వారు సాధించేదేమీ ఉండదు. అలాంటి సంఘటనను ఖండిస్తూ, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారి మృతి పట్ల ఈసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుంది. శ్రీ కిడారి సర్వేశ్వరరావు 1972వ సంవత్సరం ఏప్రిల్ 04వ తేదీన విశాఖపట్నం జిల్లా పెదబయలు మండలం గిన్నెలకోటలోని నడిమివాడ గ్రామంలో బాలన్న-గౌరమ్మ దంపతులకు జన్మించారు. వీరు బి.ఎ పట్టభద్రులు. శ్రీ కిడారి సర్వేశ్వరరావు గారు 2007–2009 మధ్య కాలంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. 2014వ సంవత్సరంలో విశాఖపట్నం జిల్లా అరకు నియోజకవర్గం నుండి ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యునిగా వీరు ఎన్నికయ్యారు. 2017వ సంవత్సరం నుండి 2018వ సంవత్సరం వరకు శాసనసభ విప్‌గా బాధ్యతలు నిర్వహించారు. వీరు అరకు నియోజకవర్గంలోని గిరిజన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుని వారి అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరు 2018వ సంవత్సరం సెప్టెంబర్ 23వ తేదీన మరణించారు. వీరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి మృతికి సంతాపంగా ఈ సభ కొద్దిసేపు మౌనం పాటిస్తుంది.

(అనంతరం సభ్యులు తమ స్థానం నుండి లేచి నిలబడి మౌనం పాటించారు.)

దయచేసి కూర్చోండి.

Now the House is adjourned to meet again at 9.00 a.m. tomorrow.

(The House then adjourned at 12.59 p.m. to meet again at 9.00 a.m. on Friday, the 1st February, 2019.)

“Published under Rule 347 of the Rules Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Assembly and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.”